విశాఖపట్టణం
ఆదివారం 13 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 212 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool



## మోడీ నేతృత్వంలో ఢిల్లీ డిక్లరేషన్‌కు
# ఏకగ్రీవ ఆమోదం

2



# నడ్డాతో బాబు భేటీ

### కీలక ప్రాజెక్టులపై చర్చ
### క్రిటికల్ కేర్ బ్లాక్‌కి ప్రారంభోత్సవం

(విజయవాడ - జయజయహే)

రాష్ట్ర అభివృద్ధి, కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం సాధించడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా మధ్య కీలక చర్చలు జరిగాయి. ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంలో భేటీ అయిన ఇరువురు నేతలు, రాష్ట్రానికి సంబంధించిన పలు కీలకమైన మౌలిక వసతులు, అభివృద్ధి ప్రాజెక్టులపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ భేటీ అనంతరం విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్‌ను కేంద్ర మంత్రి జేపీ నడ్డా శనివారం ప్రారంభించారు. దీంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన 9 సీసీ బ్లాకులను, 12 పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను ఆయన వర్చువల్ విధానంలో ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో పాటు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భీమిలి వైసీపీకి ఏమైంది..?

### మూడుసార్లు ముగ్గురికి ఛాన్స్
### ముగ్గురూ పార్టీల జంప్
### ఇటీవల కలసిరాని స్థానం






*భీమిలి వైసీపీ ఇంచార్జ్ మజ్జి శ్రీనివాసరావు ఆ పార్టీని వీడటం పొలిటికల్ ఈక్వేషన్స్‌ను మార్చేస్తుంది. గ్రేటర్ విశాఖ పరిధిలో ఉన్న భీమిలి రాజకీయంగా చాలా ప్రాముఖ్యత ఉన్న నియోజకవర్గం. ఈ సెగ్మెంట్‌లో పట్టు పెంచుకోవాలని వైసీపీ ఆవిర్భావం నుంచి ఎన్నో ప్రయోగాలు చేస్తూ వస్తుంది.*

(విశాఖపట్నం - జయజయహే)

ఒక్క 2019లో పార్టీ వేవ్ వచ్చినప్పుడు మినహా.. 2014, 2024లో రెండుసార్లు ఫ్యాన్ పార్టీ ఇక్కడ ఓడిపోయింది. అయితే ఇప్పుడు చిన్న శ్రీను తర్వాత భీమిలిలో వైసీపీకి పెద్దదిక్కెవరు అనేది బిగ్ క్వశ్చన్ మార్క్‌గా మారింది. పార్టీ, క్యాడర్ లీడర్లను ముందుండి నడిపించడమే కాకుండా..చిన్న శ్రీను ప్లేస్‌ను రీప్లేస్ చేసే లీడర్ ఎవరు.? మళ్లీ కొత్త నేతను తెరపైకి తెస్తారా.? విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఏదో ఒక నియోజకవర్గ ఇంచార్జ్‌ను వైసీపీ అధిష్టానం భీమిలికి షిఫ్ట్ చేస్తుందా అనేది చర్చనీయాంశంగా మారింది. విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉంది. టీడీపీ ఆవిర్భవించిన తర్వాత ఇప్పటిదాకా పది సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే భీమిలిలో టీడీపీ ఏడు సార్లు గెలిచింది. కాంగ్రెస్ ప్రజారాజ్యం, వైసీపీ ఒక్కోసారి గెలిచాయి. ఇక భీమిలిలో 2019లో వైసీపీ గెలిచినా రాజకీయంగా పట్టు సాధించలేకపోయింది. మూడు వర్గాలు ఆరు గ్రూపులు అన్నట్లుగా అంతర్గత కుమ్ములాటలతో సరిపెట్టారు. మరోవైపు భీమిలీ వైసీపీ నాయకత్వ బాధ్యతలు ఎవరికి ఇచ్చినా వారు తప్పుకోవడం నెగెటివ్ సెంటిమెంట్‌గా టాక్ నడుస్తోంది. దాంతో విశాఖ జిల్లాలో రాజకీయంగా ఎంతో కీలకమైన ఈ నియోజకవర్గంలో వైసీపీ ఇప్పుడు అయోమయంలో పడిపోయినట్లు అవుతోంది. భీమిలి ఇంచార్జ్‌గా 2024 డిసెంబర్‌లో చిన్న శ్రీనుకు బాధ్యతలు అప్పగించింది వైసీపీ ..మిగతా 2లో

# టీచర్ జాబ్స్ అంటే మీకు నవ్వులాట..?

### పరీక్ష రాయకుండానే ఎస్జీటీ ఉద్యోగాలా
### నకిలీ సర్టిఫికేట్స్‌ని కనీసం పరిశీలించారా
### మెగా డీఎస్సీ దగా అంటూ జగన్ ధ్వజం

(తాడేపల్లి - జయజయహే)

మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలలో సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ఏడు దశల్లో నిర్వహించినట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అందులో తీవ్ర అక్రమాలు జరిగాయని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. ఎలాంటి పరీక్షలు రాయకుండానే స్పోర్ట్స్ కోటా కింద సెకండరీ గ్రేడ్ టీచర్ ఉద్యోగాలు కేటాయించడంపై ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. టీచర్ జాబ్స్ కోసం చూస్తున్న అభ్యర్థుల జీవితాలు అంటే మీకు నవ్వులాట అయిందా అని సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. ప్రభుత్వం చెబుతున్న వివరాలు తప్పుల తడకగా ఉన్నాయని, ..మిగతా 2లో





# మళ్లీ బొత్స కన్నీళ్లు..!

### ఈసారి విజయనగరం సమావేశంలో కన్నీటి పర్యంతం
### ఇటీవల చీపురపల్లి మీటింగ్‌లోనూ కన్నీళ్లు
### మేనల్లుడు చిన్నశ్రీను పార్టీ మార్పుతో మనస్తాపం

2




# క్వాంటం బయో అద్భుతం

### కేంద్రం సహకారం ఉంటుంది
### జాతీయ గుర్తింపు ఇచ్చే యోచన చేస్తాం
### నిబద్ధత కలిగిన నేత చంద్రబాబు
### కేంద్ర మంత్రి జేపీ నడ్డా వ్యాఖ్యలు

(విజయవాడ - జయజయహే)

క్వాంటం బయో వ్యాలీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీలను విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి జేపీ నడ్డా.. ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి వర్చువల్‌గా ఈరోజు శనివారం ప్రారంభించారు. అమరావతి క్వాంటం బయో వ్యాలీకి జాతీయ గుర్తింపు ఇవ్వాలనే ముఖ్యమంత్రి సూచనకు సానుకూలంగా జేపీ నడ్డా ..మిగతా 2లో

# వర్షాలకు కొట్టుకుపోయిన గెడ్డ

### 15 గ్రామాలకు రాకపోకలు బంద్
### వైద్య సేవలకు ఇబ్బందులు
### వంతెన పునర్నించాలని గిరిజనం వినతి



(పాడేరు - జయజయహే)

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్ష బీభత్సం కనిపిస్తోంది. అల్లూరి జిల్లాలో భారీ వర్షాలు కురు-స్తున్నాయి. రెండు రోజులుగా భారీ వర్షాలకు జీకే విధి మండలం దారకొండ పంచాయతీ చిన్న గంగవరం వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వంతెన కొట్టుకుపోయింది. ఏపీ- ఒడిశా సరిహద్దులోని 15 గ్రామాలకు ఈ వంతెనపై నుంచే రాకపోకలు జరుగుతాయి. 2024లో భారీ వర్షాలకు వంతెన కొట్టుకుపోవడంతో తాత్కాలిక వంతెన నిర్మించారు. ప్రస్తుతం తాత్కాలిక వంతెన కూడా కొట్టుకుపోవడంతో 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బ్రిడ్జి లేకపోవడం వల్ల నిత్యావసర సరుకుల రవాణాతో పాటు అత్యవసర వైద్య సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. వర్షాలు, ..మిగతా 2లో



# వర్ష గండం..!

### అల్పపీడన ప్రభావం
### మోస్తారు నుంచి భారీ వర్షాలు

2

# భీమిలి వైసీపీకి ఏమైంది..?

**మొదటి పేజీ తరువాయి...**

అధినాయకత్వం. దాదాపుగా రెండేళ్ల పాటు ఆయన పార్టీ బాధ్యతలను చూస్తూ వచ్చారు. అంగబలం అర్థ బలం ఉండటంతో పాటు బలమైన కాపు సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో ఆయన భీమిలిలో వైసీపీని పటిష్టం చేసేందుకు ఎంతో కొంత శ్రమించారు. ఆయనే 2029 ఎన్నికల్లో భీమిలి నుంచి ఎమ్మెల్యేగా వైసీపీ తరఫున చేస్తారని అంతా అనుకున్నారు. కానీ స్థానిక ఎన్నికల ముందే ఆయన సడెన్‌గా ఫ్యాన్ నీడ నుంచి బయటకు వచ్చి సైకిలెక్కేశారు. దాంతో లోకల్ ఫైట్ దూసుకొస్తున్న వేళ వైసీపీ ఇక్కడ నాయకత్వ లేమితో సతమతమవుతోంది. వైసీపీ గడచిన మూడు ఎన్నికల్లో ఇద్దరికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చింది. అందులో 2014లో వైసీపీ నుంచి పోటీ చేసిన కర్రి రాము అయితే అప్పట్లో ఓడిపోగానే వైసీపీకి



రాజీనామా చేశారు. 2019 ఎన్నికల ముందు వైసీపీలో చేరిన అవంతి శ్రీనివాస్ భీమిలి నుంచి పోటీ చేసి గెలిచి మంత్రి అయ్యారు. 2024 ఎన్నికల్లో కూడా ఆయనే పోటీ చేశారు. తీరా ఓటమి చెందగానే పార్టీకి రాజీనామా చేశారు. ఆయన ప్లేస్‌లో చిన్న శ్రీనును ఇంచార్జ్‌గా పెడితే..సరిగ్గా స్థానిక ఎన్నికల వేళ ఆయన సైకిల్ ఎక్కేయడంతో వైసీపీ క్యాడర్ ఆందోళన చెందుతోంది. లోకల్ బాడీస్‌లో ఏకగ్రీవాలు జరగనిచ్చే ముచ్చటే లేదని వైసీపీ అంటోంది. కానీ భీమిలీ సీటులో ఆ పార్టీకి ఇంచార్జే లేదు. ఒకవేళ ఇప్పటికిప్పుడు ఎవరిని తెచ్చిపెట్టినా కూడా ఆయన అందరికీ పరిచయం అయ్యేలోపే స్థానిక ఎన్నికల అయిపోతాయని అంటున్నారు. మరోవైపు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన అన్ని విధాలుగా రాజకీయంగా పట్టు బిగించారు. దానికి తోడు భీమిలిలో జనసేన, టీడీపీ రెండూ కూడా బలంగా ఉన్నాయి. భీమిలి ఇంచార్జ్ విషయంలో వైసీపీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి మరి.



## క్వాంటం బయో అద్భుతం

**మొదటి పేజీ తరువాయి...**

స్పందించారు. అమరావతిలో క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటు చేయాలనే సీఎం చంద్రబాబు ఆలోచన బాగుందని ప్రశంసించారు. క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటు... ఆలోచనలపై చర్చించేందుకు... కేంద్రం నుంచి ఓ సాంకేతిక బృందాన్ని అమరావతికి పంపుతామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తోన్న సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉందని.. దీన్ని జాతీయ స్థాయిలో అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తామని జేపీ నడ్డా తెలిపారు. కిచెనే ఫార్మసీ - ఆహారమే ఔషధం అనే చంద్రబాబు కామెంట్లను తన ప్రసంగంలో జేపీ నడ్డా పదే పదే ప్రస్తావించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై సీఎం చిత్తశుద్ధిని కొనియాడారు. నడ్డాతో కలిసి వేదికపైన ముఖ్యమంత్రి సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా జేపీ నడ్డా మాట్లాడారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో ఏపీ సేఫ్ హ్యాండ్స్‌లో ఉందని కొనియాడారు.

**చంద్రబాబు పాత్ర మరువలేం..**

చంద్రబాబు విజన్-నిబద్ధత కలిగిన నాయకుడని జేపీ నడ్డా ప్రశంసించారు. ఉమ్మడి, విభజిత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో చంద్రబాబు పాత్ర మరువలేమని వ్యాఖ్యానించారు. కిచెనే ఫార్మసీ - ఆహారమే ఔషధమనే చంద్రబాబు మాటలు నూటికి నూరు శాతం నిజమని తెలిపారు. ఆరోగ్యం కాపాడుకోవడానికి ఇదే మూల సూత్రమని వెల్లడించారు. వైద్యం, ఆరోగ్యానికి ఏపీ హై ప్రయార్టీ ఇస్తోందని చెప్పుకొచ్చారు. పోలవరం ఎడమ కాలువ, వెలిగొండ, హంద్రీ-నీవా ప్రాజెక్టులను ప్రారంభించడం హర్షించదగ్గ విషయమని కేంద్రమంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు.

## వర్ష గండం..!

**అల్పపీడన ప్రభావం... మోస్తారు నుంచి భారీ వర్షాలు**

**(అమరావతి - జయజయహే)**

దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతంలో అల్పపీడనం కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ అల్పపీడనం రాబోయే 24 గంటల్లో విదర్భ మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని వెల్లడించారు. దీని ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వానలు పడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. అల్లూరిసీతారామరాజు జిల్లా, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వానలు పడతాయని వివరించారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ వర్షాలతోపాటు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెట్లు, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడరాదని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.

## టీచర్ జాబ్స్ అంటే మీకు నవ్వులాట..?

**మొదటి పేజీ తరువాయి...**

స్పోర్ట్స్ కోటాలో జాబ్ కొట్టినట్లు చెబుతున్నా, అసలు ఈవెంట్లలో విజేతల జాబితాలో మెగా డీఎస్సీ జాబ్ కొట్టిన వారి పేర్లు ఎందుకు లేవో చెప్పాలన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. కమ్మ, రెడ్లే సీఎం అవ్వాలా? మార్పు రావాలి.. విజయదశమి తరువాత పార్టీ ప్రకటన: విజయసాయిరెడ్డి విశాఖపట్నంలో యోగేశ్వరరావు అనే అభ్యర్థికి, అలాగే ఆయన చెల్లికి ఎలాంటి రాత పరీక్ష లేకుండానే స్పోర్ట్స్ కేటగిరీ కింద ఎస్జీటీ టీచర్ పోస్టులు ఇచ్చారని జగన్ పేర్కొన్నారు. 2009లో నల్గొండలో జరిగిన 23వ సీనియర్ సౌత్ నేషనల్ ఖో-ఖో ఛాంపియన్‌షిప్‌లో వీరిద్దరూ వరుసగా తొలి, రెండో స్థానాలు సాధించినట్లు సర్టిఫికెట్లు సబ్మిట్ చేశారు. అయితే, తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ విడుదల చేసిన విజేతల అధికారిక జాబితాలో వీరి పేర్లు లేవని తేలిందని జగన్ స్పష్టం చేశారు.

**కేస్ స్టడీ 2 -- నకిలీ సర్టిఫికేట్ల నిర్లక్ష్యం**

మరో కేసులో బసవేశ్వరరావు అనే అభ్యర్థి గుడివాడలో జరిగిన 49వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఖో-ఖో ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్నట్లు నకిలీ సర్టిఫికేట్ సమర్పించి ఉద్యోగం పొందారని వైఎస్ జగన్ తెలిపారు. ఈ సర్టిఫికేట్ నకిలీదని ఖో-ఖో అసోసియేషన్ స్వయంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కు నియామకాల కంటే ముందే (11-07-2025న) అధికారిక లేఖ ద్వారా తెలిపించినప్పటికీ, ఆ లేఖను పక్కన పడేసి ఉద్యోగం ఇచ్చారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. ప్రగడ కళ్యాణి అనే అభ్యర్థికి 2003లో నాగార్జున యూనివర్సిటీలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీల్లో పాల్గొన్నట్లు ఉన్న సర్టిఫికేట్ ఆధారంగా ఎలాంటి పరీక్ష లేకుండానే ఉద్యోగం ఇచ్చారని జగన్ తెలిపారు. అయితే నాగార్జున యూనివర్సిటీలో ఆల్ ఇండియా పోటీలు అసలు జరగలేదని, అక్కడ కేవలం సౌత్ వెస్ట్ జోన్ పోటీలు మాత్రమే జరిగాయని తేలినట్లు పేర్కొన్నారు. 7 ఫేజ్ వెరిఫికేషన్ పూర్తయినా ఇలాంటి ఫేక్ సర్టిఫికేట్లతో ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందడం మెగా డిఎస్సీ స్కామ్‌ను స్పష్టం చేస్తోందని మాజీ సీఎం జగన్ విమర్శించారు.

## వర్షాలకు కొట్టుకుపోయిన గెడ్డ

**మొదటి పేజీ తరువాయి...**

వరదల కారణంగా రాకపోకలు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. వెంటనే కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టి తమ సమస్యను పరిష్కరించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. అల్పపీడనం ప్రభావంతో రాగల 6 గంటలు శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు వర్ష సూచన ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ శనివారం తెలిపింది. రాగల 2 గంటలు కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, 60 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. మిగతా జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందంది. ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని తెలిపింది. దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాలపై కేంద్రీకృతమై ఉన్న అల్పపీడనం, ఇది రాబోయే 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా దక్షిణ ఛత్తీస్‌గఢ్, విదర్భ మీదుగా కదిలే అవకాశం ఉందని తెలిపింది.

## షుగర్స్ రైతుల బకాయిలు చెల్లించండి

**చోడవరం సెప్టెంబర్ 12 జయ జయహే**



అనకాపల్లి జిల్లాలోని షుగర్ ఫ్యాక్టరీలను రక్షించి చెరుకు రైతులను అన్ని రంగాలలో ఆదుకోవాలని జాతీయ రైతు పరిరక్షణ సమితి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఆడారి కన్నారావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్ర రాష్ట్ర చరిత్రలోనే బంగారు బాతు గుడ్డు లాంటి గోవాడ షుగర్ ఫ్యాక్టరీ, తుమ్మపాల, తాండవ ఏటికొప్పాక అను నాలుగు షుగర్ ఫ్యాక్టరీలు అనకాపల్లి జిల్లాకు చెందిన రైతుల పాలిట జీవ నాడులుగా నిలిచేవన్నారు. ఈ ప్రాంత రైతులు ఆయా షుగర్ ఫ్యాక్టరీలకు చెరుకు తరలించి తమ జీవనం కొనసాగించే వారన్నారు. ప్రతీ ఒక్క రైతూ తమ యొక్క పంట పొలాల్లో చెరుకు పంటలు వేసి, ఆయా పొలాల్లో సందడి చేసే వారన్నారు. దీని వల్ల ఈ షుగర్ ఫ్యాక్టరీలపై ఆధారపడి వేల సంఖ్యలో చెరుకు రైతులు, ఉద్యోగులు కార్మికులు సంతోషంగా బతికే వారన్నారు. ఇంతటి బంగారు భవిష్యత్తుతో కూడిన షుగర్ ఫ్యాక్టరీలు మూత బడడంతోని చెరుకు పంటలు పండే పచ్చని పొలాల్లో సరుగుడు తోటలు దర్శన మిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ స్పందించి రైతులకు కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

## మళ్లీ బొత్స కన్నీళ్లు..!

**ఈసారి విజయనగరం సమావేశంలో కన్నీటి పర్యంతం**

**ఇటీవల చీపురపల్లి మీటింగ్‌లోనూ కన్నీళ్లు**

**మేనల్లుడు చిన్నశ్రీను పార్టీ మార్పుతో మనస్తాపం**

**(విజయనగరం - జయజయహే)**



విజయనగరం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవలి ఎన్నికల ఫలితాల అనంతరం జిల్లా పార్టీలో మొదలైన చేరికలు, రాజీనామాలు కేడర్‌ను తీవ్రంగా కలిచివేస్తున్నాయి. ఈ క్రమంలో విజయనగరంలోని జగన్నాథ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం రాజకీయంగా తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ ముఖ్య నేతలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు, కార్యకర్తలు భారీగా హాజరైన ఈ వేదికపై సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతం కావడం సభలో ఉన్నవారందరినీ తీవ్ర ఉద్వేగానికి గురిచేసింది. బొత్స సత్యనారాయణ ప్రధాన అనుచరుడు, బంధువు అయిన చిన్న శ్రీను ఇటీవల వైఎస్సార్‌సీపీని వీడి ప్రత్యర్థి పార్టీలో చేరడంపై సమావేశంలో చర్చ జరిగింది. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ విజయనగరం కేడర్ అంతా 'బొత్స 2.0' కోసం వేచి చూస్తోందని పేర్కొన్నారు. రాజకీయాల్లో ఎందరినో నాయకులుగా తీర్చిదిద్దిన బొత్స కుటుంబాన్ని ఏ శక్తులూ విడదీయలేవని స్పష్టం చేశారు. ఇదే సమయంలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కూడా మాట్లాడుతూ, చిన్న శ్రీను నిర్ణయం వల్ల తనపై పడుతున్న ప్రభావంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ భావోద్వేగానికి గురయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం నాయకులను మాత్రమే నమ్ముకుని పెట్టలేదని, వైఎస్సార్ అభిమానులు, కార్యకర్తల బలంతోనే నడుస్తోందని నాయకులు పునరుద్ఘాటించారు. అధికారంలో ఎవరు ఉన్నా కాలక్రమేణా పరిస్థితులు మారుతాయని, వైఎస్సార్‌సీపీ కేడర్ అంతా ఐక్యంగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర పిలుపునిచ్చారు. ప్రలోభాలకు లొంగకుండా పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకూ భవిష్యత్తులో తగిన గుర్తింపు లభిస్తుందని ధైర్యం చెప్పారు.

# మోడీ నేతృత్వంలో ఢిల్లీ డిక్లరేషన్‌కు ఏకగ్రీవ ఆమోదం

**గ్లోబల్ సంస్కరణల దిశానిర్దేశంలో కీలక పాత్ర పోషించాలి**

**బ్రిక్స్ సభ్య దేశాల కోసం సురక్షితమైన డిజిటల్ రిపోజిటరీ (డేటాబేస్) అవసరం**

**బ్రిక్స్ కంటిన్యూటీ, ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు**

**ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని సంస్కరించాలి**

**గ్లోబల్ మిలిటరీ ఖర్చులు పెరిగి పోవడం పట్ల విచారం**

**డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ**

**పుతిన్, జిన్‌పింగ్ లకు మోదీ ఘన స్వాగతం**

**హాజరైన 21 దేశాలు**

**న్యూఢిల్లీ, - జయజయహే**

భారత రాజధాని న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మండపం వేదికగా 18వ బ్రిక్స్ సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. సమావేశంలో న్యూ దిల్లీ డిక్లరేషన్ 2026 కు బ్రిక్స్ కూటమిలోని సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. బ్రిక్స్ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన భారత్ కు ఇది అతిపెద్ద దౌత్య విజయం అని చెప్పొచ్చు. భారత్ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు కూటమిలోని ఏ దేశం కూడా అభ్యంతరం చెప్పకపోవడం విశేషం. ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. భౌగోళిక రాజకీయ అంశాలపై సభ్య



దేశాల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు ఏకాభిప్రాయం లభించడం భారత్ కు అతిపెద్ద దౌత్య విజయంగా నిలుస్తుందని అన్నారు. అంతర్జాతీయ విధానాలు, ఆర్థిక సహకారం, శాంతిభద్రతలపై సభ్య దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ నిర్ణయం చాటిచెబుతోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలను ఇక ఏమాత్రం ఆలస్యం చేయకూడదని మోదీ స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుంటూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలని సూచించారు. మనం ఎవరికీ వ్యతిరేకం కాదు, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లేందుకే ప్రయత్నిస్తామని ప్రధాని తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. అధికారాలు, విశేషాధికారాలు ఉన్న అగ్ర దేశాల వ్యవస్థను రాబోయే 20 ఏళ్లలో ఒక భాగస్వామ్య వేదికగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిక్స్ సభ్య దేశాల కోసం ఒక సురక్షితమైన డిజిటల్ రిపోజిటరీ (డేటాబేస్) సృష్టించగలమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సంస్కరణల దిశానిర్దేశం చేయడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాలన్నారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలను, అంగీకరించిన అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి 'బ్రిక్స కంటిన్యూటీ, ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కష్టకాలంలో ఉన్న గ్లోబల్ సౌత్ దేశాలకు ఈ కూటమి ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆయన కోరారు. ఇక రెండు రోజుల పాటు జరిగే ఈ 18వ బ్రిక్స సమావేశంలో భారత్, రష్యా, చైనా, బ్రెజిల్, ఈజిప్ట్, ఇండోనేషియా, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా సహా మొత్తం 21 దేశాలు పాల్గొన్నాయి. అయితే విబేధాలు పక్కన పెట్టి మరీ ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా దేశాలు న్యూ దిల్లీ డిక్లరేషన్ కు ఆమోదం తెలపడం కీలకంగా మారింది. న్యూ దిల్లీ డిక్లరేషన్ లోని కీలక విషయాలు చూస్తే ప్రపంచ వాణిజ్య సంస్థల నిబంధనలకు విరుద్ధంగా, వాణిజ్యాన్ని దెబ్బతీసే విధంగా ఏకపక్ష సుంకాలు పెరగడంపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి ఏకపక్ష చర్యలను బ్రిక్స్ దేశాలు ఖండించాయి. అలాగే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యుద్ధాలు, ఘర్షణలను శాంతి యుతంగా, దౌత్య పరంగా మాత్రమే పరిష్కరించుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని బ్రిక్స్ కూటమి స్పష్టం చేసింది. అలాగే ప్రపంచంలో నెలకున్న సమస్యలపై వివిధ దేశాలు చూసే దృక్కోణాన్ని తాము స్వాగతిస్తున్నట్లు తెలిపాయి. దాంతోపాటు అంతర్జాతీయ సమస్యలపై శాంతి యుత చర్చలు, భాగస్వామ్యాన్ని నొక్కి చెప్పాయి. అలాగే గతేడాది ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిని బ్రిక్స దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇది క్రిమినల్ చర్య అని ఎప్పటికీ క్షమించరానిదని తెలిపాయి. ఈ ఘోర ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా మరెందరో గాయపడినట్లు వివరించాయి. ఇలాంటి ఉగ్రవాద చర్యలను అసలు ఉపేక్షించేది లేదని బ్రిక్స కూటమి దేశాలు స్పష్టం చేశాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఎదుర్కొనేందుకు తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించాయి. వీటితోపాటు మారుతున్న, వర్తమాన ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని బ్రిక్స దేశాలు డిమాండ్ చేశాయి. భారత్ నేతృత్వంలో ఈ బ్రిక్స్ సదస్సు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తీర్మానించాయి. ఐరాస భద్రతా మండలిలో నిర్మాణాత్మక మార్పులు, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు భద్రతా మండలిలో మెరుగైన ప్రాతినిధ్యం దక్కాలని దిల్లీ డిక్లరేషన్ ఆకాంక్షించింది. ముఖ్యంగా భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్ దేశాలకు మరింత పెద్ద పాత్ర దక్కాలన్న డిమాండ్‌కు శాశ్వత సభ్య దేశాలైన చైనా, రష్యాలు తమ మద్దతును పునరుద్ఘాటించాయి. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం దక్కాలని బ్రిక్స్ కూటమి డిమాండ్ చేసింది. వాణిజ్యపరంగా ఈ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీలలోనే ఎక్కువగా జరగాలని, సరిహద్దు చెల్లింపుల కోసం ఆచరణాత్మక పరిష్కారాలను సులభతరం చేయాలని డిక్లరేషన్ పేర్కొంది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు, బలవంతపు చర్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ ప్రదర్శించాలని పిలుపునిచ్చింది. పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. సరిహద్దు ఉగ్రవాదం, ఉగ్ర నిధులు అరికట్టాలని, ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ వైఖరి వీడాలని స్పష్టం చేసింది.

అలాగే అణు కేంద్రాలపై జరుగుతున్న దాడులను, పెరుగుతున్న అణ్వస్త్ర ప్రమాదాలను ఖండించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తూ, గ్లోబల్ మిలిటరీ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం పట్ల విచారం వ్యక్తం చేసింది. అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాలకు శిలాజ ఇంధనాలు ఇంకా అవసరమేనని స్పష్టం చేస్తూనే, పర్యావరణ అనుకూల ఇంధనాల వైపు మారాలని డిక్లరేషన్ సూచించింది. ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటుకు బ్రిక్స్ దేశాలు తీర్మానించాయి. ఆర్థిక, సామాజిక వృద్ధిలో నిర్ణయాధికారులుగా మహిళల పాత్ర అత్యంత కీలకమని న్యూదిల్లీ డిక్లరేషన్ గుర్తించింది.

# 7వ ఆర్ఎఫ్ఎస్ఎల్ ప్రారంభం..






## నాలుగు జిల్లాలకు శాస్త్రీయ దర్యాప్తు సేవలు

**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 12:**

ఆంధ్రప్రదేశ్‌లో ఫోరెన్సిక్ సేవలను మరింత బలోపేతం చేసే దిశగా రాజమహేంద్రవరంలో నూతన రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ ప్రారంభమైంది. రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా శనివారం ల్యాబొరేటరీని ప్రారంభించారు. ఏలూరు రేంజ్ ఐ జి జి .వి .జి . అశోక్ కుమార్, ఏ పి ఎఫ్ ఎస్ ఎల్ డైరెక్టర్ పి . హెచ్.డి . రామకృష్ణ, తూర్పుగోదావరి ఎస్పీ ఐ. నరసింహ కిషోర్ డిజిపి కి స్వాగతం పలికారు. ప్రారంభం అనంతరం డిజిపి ఆర్ఎఫ్ఎస్ఎల్ లోని వివిధ విభాగాలను పరిశీలించి, ఫోరెన్సిక్ పరీక్షల విధానం, సదుపాయాలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ 2025లో రాష్ట్రంలో 1,87,721 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, వీటిలో ఏడేళ్లు లేదా అంతకంటే ఎక్కువ శిక్ష పడే నేరాలకు సంబంధించిన 16,847 కేసులు ఉన్నాయని తెలిపారు. ఎఫ్ ఎస్ ఎల్ , క్రైమ్‌స్పాట్ బృందాలు సుమారు 4,200 నేరస్థలాలను సందర్శించగా, 25,602 కేసులను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపినట్లు చెప్పారు. 2025లో ఏ పి ఎఫ్ ఎస్ ఎల్ 23,682 కేసులను పరిష్కరించి 92.5 శాతం డిస్పోజల్ రేటు సాధించిందన్నారు. కర్ణాటక తర్వాత దేశంలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని తెలిపారు. హత్య, పోకసో , మహిళలపై నేరాల కేసుల్లో ఫోరెన్సిక్ నివేదికల సమయాన్ని 15 రోజుల నుంచి 7 రోజులకు, ఎన్ డి పి ఎస్ కేసులను 30 రోజుల నుంచి 14 రోజులకు తగ్గించామని వెల్లడించారు. డిఎన్ఏ డిటెక్షన్ రేటు 85 నుంచి 97 శాతానికి, రక్తగ్రూప్ డిటెక్షన్ రేటు 52 నుంచి 85.77 శాతానికి పెరిగిందన్నారు. కొత్త క్రిమినల్ చట్టాల అమలులో భాగంగా రాష్ట్రంలో 24ఐ7 మూడు అంచెల ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఏడేళ్లకు పైగా శిక్ష పడే నేరాలకు 26 మొబైల్ ఫోరెన్సిక్ వాహనాలు, తీవ్రమైన కేసులకు నిపుణుల బృందాలు పనిచేస్తున్నాయని వివరించారు. రాజమహేంద్రవరం ఆర్ ఎఫ్ ఎస్ ఎల్ ను రూ. 3.60 కోట్లతో +o2 భవనంగా నిర్మించగా, రూ. 2.80 కోట్ల విలువైన ఆధునిక పరికరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం బయాలజీ, సెరోలజీ, టాక్సికాలజీ విభాగాలు పనిచేస్తున్నాయి. ఈ ల్యాబ్ ద్వారా తూర్పుగోదావరి, కాకినాడ, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, పోలవరం జిల్లాలకు ఫోరెన్సిక్ సేవలు అందనున్నాయి. ఏడాదికి సుమారు 2,300 కేసులను స్వీకరించే సామర్థ్యం ఉంది. భవిష్యత్తులో డిఎన్ఏ ప్రొఫైలింగ్, సైబర్ ఫోరెన్సిక్ విభాగాలను విస్తరించే ప్రతిపాదన పరిశీలనలో ఉందని డీజీపీ తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్ ఎఫ్ ఎస్ ఎల్ రాష్ట్రంలో 7వ రీజినల్ ఫోరెన్సిక్ ల్యాబొరేటరీగా అందుబాటులోకి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఫోరెన్సిక్ మౌలిక వసతులను మరింత ఆధునీకరిస్తున్నామని డీజీపీ తెలిపారు. కోనసీమ ఎస్పీ రాహుల్ మీనా, ఏలూరు ఎస్పీ కె .పి . శివ కిషోర్, పశ్చిమగోదావరి ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, కృష్ణాజిల్లా ఎస్పీ వి . విద్యాసాగర్ నాయుడు, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, ఎఫ్ ఎస్ ఎల్ జాయింట్ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, అధికారులు, సిబ్బంది, తూర్పుగోదావరి పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



## సంపద దాచకుండా ఖర్చు చేయాలి

### మతం, ఆర్థిక శాస్త్రం ఇదే చెప్తుంది.

### కరుణా దినోత్సవంలో న్యాయవాది ఐ ఎం అహ్మద్

**విశాఖపట్నం, సెప్టెంబర్ 12, జయ జయహే**

కరుణా దినోత్సవం సందర్భంగా అరిలోవలోని విశాఖ మరియా మాక్స్, సెయింట్ ఆన్స్ కాన్వెంట్ ఆధ్వర్యంలో శనివారం "పేదలకు ఆత్మగౌరవాన్ని అందిస్తున్న మహిళలు" అనే ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. దయాగుణం, పంచుకునే తత్వం, సామాజిక బాధ్యతను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గుర్తించిన సుమారు 70 అత్యంత పేద కుటుంబాలకు రూ. 2 లక్షల విలువైన గృహోపకరణాలను అందించారు. ముఖ్య అతిథి న్యాయవాది ఐ ఎం అహ్మద్ సహకారమే కాకుండా తన వంతుగా రూ. 10 వేల నగదు అందజేశారు. మహిళా సభ్యులు స్వచ్ఛందంగా రూ. 70 వేల నగదు, 5 సీలింగ్ ఫ్యాన్లు, ఒక మంచం, ఒక బీరువా, వంటపాత్రలు విరాళంగా అందించగా, సంస్థ తరఫున మిగిలిన మొత్తాన్ని సమకూర్చి అవసరమైన వస్తువులను కొనుగోలు చేశారు. లబ్ధిదారులకు 17 మంచాలు, 7 బీరువాలు, 12 టేబుల్ ఫ్యాన్లు, 13 సీలింగ్ ఫ్యాన్లు, 8 స్టాండ్ ఫ్యాన్లు, 10 కుక్కర్లు, 5 గ్యాస్ స్టవ్లు, వంటపాత్రలు, 7 గ్రైండర్లు, 1 మిక్సీలు, తదితర వస్తువులను అందజేశారు. కనీస గృహావసరాలు కూడా లేని కుటుంబాలకు ఈ సహాయం అందించడం ద్వారా వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే కార్యక్రమం ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం సెయింట్ ఆన్స్ సొసైటీ ప్రావిన్షియల్ సుపీరియర్ సిస్టర్ శాండ్విన్, సీనియర్ అడ్వకేట్ ఐ.ఎం. అహ్మద్, పారిష్ ఫాదర్ రాజు తదితరులు పాల్గొన్నారు. సుమారు 500 మంది మహిళలు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.



## పుష్కరాల వేళ.. కాలుష్యానికి చెక్!

### పేపర్ మిల్లు 15 రోజులు మూసేయాలి.. అఖిలపక్షంతో సమగ్ర కార్యాచరణ

**రాజమహేంద్రవరం,: జయ జయహే సెప్టెంబరు 12:**

గోదావరి పుష్కరాల నేపథ్యంలో కాలుష్య నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, పుష్కరాలకు 15 రోజుల ముందు ఎపి పేపర్ మిల్లును షట్‌డౌన్ చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. కాలుష్యంపై డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ స్పందించిన తీరును అభినందిస్తూ, నోటీసులతో సరిపెట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రభుత్వం ఆధ్వర్యంలో విస్తృత అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కోరింది. 'గోదావరి కాలుష్యం--రానున్న పుష్కరాలు' అంశంపై శ్రీకృష్ణ సాయి కళ్యాణ మండపంలో టి.కె. విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. మహిళలకు ప్రత్యేక ఘాట్ ఏర్పాటు చేసి అక్కడ ఫొటోలు, వీడియోలు తీయకుండా చూడాలని, వృద్ధులకు ప్రత్యేక ఘాట్, వాలంటీర్లు ఏర్పాటు చేయాలని విశ్వేశ్వరరెడ్డి సూచించారు. తీర్థ విధులకు రెండు ఘాట్లు, వీఐపీలకు ప్రత్యేక ఘాట్, అన్ని ఘాట్ల వద్ద మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని కోరారు. పుష్కరాలకు ముందే హేవలాక్ బ్రిడ్జి, దివాన్‌చెరువు వంతెన పనులు పూర్తి చేయాలని, నగరంలో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని సూచించారు. యాత్రికుల కోసం తగిన షెల్టర్లు, లాలాచెరువు, మోరంపూడి, బొమ్మూరు ప్రాంతాల్లో నడక మార్గాలకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. పుష్కరాల సమయంలో గోకవరం బస్టాండ్, గోదావరి రైల్వేస్టేషన్ వద్ద రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. టిడిపి సీనియర్ నేత గన్ని కృష్ణ మాట్లాడుతూ పైపులైన్ల కోసం తవ్విన రోడ్లను పనులు పూర్తికాగానే వెంటనే పూడ్చాలని, ప్రజల ఇబ్బందులను పట్టించుకోవాలని కోరారు. పేపర్ మిల్లు దుర్వాసనపై ప్రభుత్వం సీరియస్‌గా చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ ఎంపీ భరత్ మాట్లాడుతూ గోదావరి కాలుష్యం తీవ్రంగా ఉందని, గతంలో కాలుష్య నివారణకు రూ. 716 కోట్ల డీపీఆర్ సిద్ధం చేసి కేంద్రం నుంచి రూ. 88 కోట్లు మంజూరు చేయించామని తెలిపారు. నల్లా ఛానల్ వద్ద మురుగునీటిని సక్రమంగా పంపింగ్ చేయాలని, పుష్కరాలకు భారీగా యాత్రికులు వచ్చే నేపథ్యంలో ట్రాఫిక్‌పై ముందస్తు చర్యలు అవసరమన్నారు. అఖిలపక్ష నాయకుడు దేశిరెడ్డి బలరామనాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్ చర్యలను అభినందించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ కాలుష్యంతో పాటు ట్రాఫిక్, పుష్కర నిధులు, ప్రాధాన్యతా పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. టిడిపి నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు సమావేశ నిర్ణయాలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. జీవకారుణ్య సంఘం చైర్మన్ వర్రే శ్రీనివాసరావు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను వివరించారు. సమావేశంలో టి. అరుణ్, టి. మధు, కాశీ నవీన్‌కుమార్, వి.ఎస్.ఎస్. కృష్ణకుమార్, కుదుపూడి పార్థసారధి, నల్లా రామారావు, వి. కొండలరావు, జె.టి. రామారావు, ఆకుల భాగ్యలక్ష్మి, వి. శేషగిరి వరప్రసాద్, బుడ్డిగ రవి, ఎస్.వి.వి. రెడ్డి, కె.వి. ఆనంద్‌కుమార్, ఎస్. సూరిబాబు, సీహెచ్ఎస్ వీరభద్రారెడ్డి, ఆర్. బాలకృష్ణ, కె. రాంబాబు, ఎ బి ఎస్ లక్ష్మణ్, కె.ఎస్. పట్నాయక్, ఎన్. అప్పారావు, ఎండి షరాన్, ఎస్. లలిత, బివివి గిరి, ఎ . వెంకటేశ్వరరావు, జె. రాంబాబు, వై. శ్రీనివాస్, బి వి ఎన్ పూర్ణిమరాజు తదితరులు పాల్గొన్నారు.



## అగ్రహారంలో కుక్కల రాజ్యం!

### గుంపులుగా వీధుల్లో సంచారం.. అడుగు బయట పెట్టాలంటేనే జంకుతున్న ప్రజలు

**రాజమహేంద్రవరం: జయ జయహే : సెప్టెంబర్ 12**

ధవళేశ్వరం అగ్రహారం వీధుల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది. గుంపులుగా కుక్కలు రహదారులపై సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు ఉదయం, సాయంత్రం రోడ్లపైకి రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. కుక్కలు వెంటపడతాయన్న ఆందోళనతో పిల్లలను ఒంటరిగా పాఠశాలకు పంపేందుకు తల్లిదండ్రులు సాహసించలేకపోతున్నారు. మహిళలు, వృద్ధులు కూడా రాత్రి వేళల్లో బయటకు రావడానికి జంకుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని కుక్కలు వెంబడిస్తుండటంతో ప్రమాదాల ముప్పు పెరిగింది. ఒక్కసారిగా రోడ్డుపైకి కుక్కలు రావడంతో వాహనదారులు అదుపు తప్పే పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాదచారులు సైతం కుక్కల గుంపులను తప్పించుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. ధవళేశ్వరం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కేవలం అప్పుడప్పుడు కుక్కలను తరలించడం కాకుండా, కుక్కల సంఖ్యను నియంత్రించేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో స్టెరిలైజేషన్, యాంటీ-రేబిస్ వ్యాక్సినేషన్ వంటి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. వీధి కుక్కల దాడులతో ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అగ్రహారం వీధుల్లో ప్రత్యేకంగా కుక్కల బెడద ఉన్న ప్రాంతాలను గుర్తించి, పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రతను దృష్టిలో పెట్టుకుని తక్షణమే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## విద్యుత్ ఎస్ఈ శ్యాంబాబుకు సీజీఎంగా పదోన్నతి

### ఎస్ ఈగా మధురవాడ ఈఈ సింహాచలం నాయుడు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 12, జయ జయహే**



తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) విశాఖపట్నం ఎస్ ఈ గెడ్డం శ్యాంబాబుకు పదోన్నతి లభించింది. చీఫ్ జనరల్ మేనేజర్ గా పదోన్నతి కల్పిస్తూ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో మధురవాడలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా వున్న సింహాచలం నాయుడు కు పదోన్నతి కల్పిస్తూ ఎస్ఈ గా నియమించారు. అలాగే కాకినాడ ఈ ఈ ఎన్ ఉదయ్ భాస్కర్ కి కూడా పదోన్నతి కల్పించి అక్కడే ఎస్ఈ గా నియమించారు. అయితే ఈ పదోన్నతుల తంతు గత నెల రోజులుగా ఉద్యోగుల్లో నానుతోంది. ఎట్టకేలకు ఉత్తర్వులు జారీ కావడంతో పుకార్లకు తెరపడింది.




## మట్టితో మమకారం.. పర్యావరణ పరిరక్షణకు ఆవోపా బాట!

### 500 ఎకో ఫ్రెండ్లీ వినాయక విగ్రహాల పంపిణీ

**రాజమహేంద్రవరం: జయ జయహే సెప్టెంబర్ 12**

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ఆర్య వైశ్య ఆఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో ఎకో ఫ్రెండ్లీ మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం శనివారం సాయంత్రం చల్లపల్లి వారి వీధి, టీ-నగర్ గణపతి మందిరం వద్ద ఘనంగా జరిగింది. ఆవోపా, టీ-నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వరుసగా ఆరవ సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు సంఘాలకు నాయకత్వం వహిస్తూ తనదైన శైలిలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బురగడ్డ మురళి ఆధ్వర్యంలో 500 మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో ఆవోపా రాజమహేంద్రవరం అధ్యక్షులు రవి కుమార్, కార్యదర్శి రాము, కోశాధికారి రమణ, ఉపాధ్యక్షులు సబ్బిశెట్టి రాంబాబుతో పాటు స్థానిక మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు శ్రీరామ్ ఫైనాన్స్ భరోసా

**విజయవాడ (జయ జయహే)**

రవాణా రంగంలో పనిచేస్తున్న కుటుంబాల పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని శ్రీరామ్ ఫైనాన్స్ సీ ఎస్ ఆర్ కార్యక్రమం ద్వారా విద్యకు ప్రాధాన్యత ఇస్తోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. 2026--27 విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా సుమారు రూ. 100 కోట్లతో, కృష్ణా జిల్లాలో రూ. 2 కోట్లతో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. 1974లో ప్రారంభమైన శ్రీరామ్ గ్రూప్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3,500కు పైగా బ్రాంచీలు, 90,000 మందికి పైగా ఉద్యోగులు, కోటి మందికి పైగా కస్టమర్లతో సేవలందిస్తోందన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 35 బ్రాంచీల ద్వారా రవాణా రంగానికి రుణ సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, శ్రీరామ్ ఫైనాన్స్ జేఎండీ, సీఓఓ సుదర్శన్ బి. హొల్లా, కృష్ణా జిల్లా రవాణా కమిషనర్ ఎం. పురేంద్ర, ఏఐఎంటీసీ ఉపాధ్యక్షుడు వై.వి. ఈశ్వరరావు, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజా, శ్రీరామ్ ఫైనాన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.








# భారత రైల్వేల భద్రత

## ఆధునికీకరణతో పాటు జవాబుదారీతనం అవసరం

(ప్రతాప్)

భారత రైల్వేలు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక మాత్రమే కాదు, కోట్లాది ప్రజల నిత్యజీవితంలో విడదీయరాని భాగం. ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే ఈ మహత్తర రవాణా వ్యవస్థలో వేగం, సౌకర్యం, ఆధునికీకరణ ఎంత ముఖ్యమో భద్రత అంతకంటే ముఖ్యమైనది. రైళ్ల వేగాన్ని పెంచడం, కొత్త మార్గాలను నిర్మించడం, విద్యుదీకరణ, ఆధునిక బోగీలు, అధునాతన సంకేత వ్యవస్థలు వంటి చర్యలు అవసరమే. కానీ ప్రయాణికుడు సురక్షితంగా గమ్యస్థానానికి చేరినప్పుడే ఆ అభివృద్ధికి నిజమైన అర్థం ఉంటుంది.

సంతోషకరమైన విషయం ఏమిటంటే భారత రైల్వేల్లో ప్రమాదాల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. అందుబాటులో ఉన్న రైల్వే గణాంకాల ప్రకారం 2023--24లో ప్రమాదకర రైలు ఘటనలు 169 ఉండగా, 2024--25లో అవి 121కు తగ్గాయి. 2019--20లో నమోదైన 352 ఘటనలతో పోలిస్తే ఈ తగ్గుదల గణనీయమైనదే. అయితే ప్రమాదాల సంఖ్య తగ్గడం మాత్రమే భద్రతా వ్యవస్థ పూర్తిగా పటిష్ఠమైందనడానికి ప్రమాణం కాదు. ఒకే ఒక భారీ ప్రమాదం కూడా వందలాది కుటుంబాల జీవితాలను శాశ్వతంగా మార్చగలదు. అందువల్ల 'ప్రమాదాలు తగ్గుతున్నాయి' అనే సంతృప్తి కంటే 'ప్రమాదాలను సాధ్యమైనంతవరకు నివారించే వ్యవస్థను ఎలా నిర్మించాలి?' అన్నదే ప్రధాన ప్రశ్న కావాలి.

ఈ దిశలో స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'కవచ్' స్వయంచాలక రైలు రక్షణ వ్యవస్థ కీలకమైన ముందడుగు. ప్రమాదకర పరిస్థితుల్లో రైలు వేగాన్ని నియంత్రించడం, ఎరుపు సంకేతాన్ని దాటి వెళ్లే పరిస్థితులను నివారించడం, అవసరమైనప్పుడు స్వయంచాలకంగా బ్రేకులు అమలు చేయడం వంటి రక్షణ చర్యలకు ఇది ఉపయోగపడుతుంది. 'కవచ్'ను మరింత విస్తృతంగా అమలు చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. 2024 జూలైలో దాని నాలుగో సంస్కరణకు



సంబంధించిన సాంకేతిక ప్రమాణాలు కూడా జారీ అయ్యాయి.

అయితే సాంకేతిక పరిజ్ఞానం ఒక్కటే భద్రతకు సమాధానం కాదు. పట్టాల నిర్వహణ రైల్వే భద్రతకు ప్రాథమికమైన అంశం. పట్టాల తనిఖీలు, లోపాల ముందస్తు గుర్తింపు, వంతెనల పర్యవేక్షణ, పట్టాల పునరుద్ధరణ, రైలు చక్రాలు--బోగీల తనిఖీ, విద్యుత్ మరియు సంకేత వ్యవస్థల నిర్వహణలో నిరంతర అప్రమత్తత అవసరం. అత్యాధునిక పరికరాలు ఉన్నప్పటికీ వాటిని సకాలంలో ఉపయోగించకపోతే లేదా గుర్తించిన లోపాలను వెంటనే సరిచేయకపోతే సాంకేతిక పెట్టుబడుల ప్రయోజనం పరిమితమవుతుంది.

ఇక్కడ మానవ వనరుల పాత్ర అత్యంత కీలకం. లోకో పైలట్లు, ట్రాక్ నిర్వహణ సిబ్బంది, సంకేత వ్యవస్థ నిపుణులు, రైలు నియంత్రణ సిబ్బంది, ఇంజినీరింగ్ మరియు నిర్వహణ విభాగాల ఉద్యోగులకు నిరంతర శిక్షణ అవసరం. కొత్త సాంకేతిక వ్యవస్థలను ప్రవేశపెట్టినప్పుడు వాటిని సక్రమంగా నిర్వహించే సామర్థ్యాన్ని కూడా సమాంతరంగా పెంచాలి. రైల్వే శిక్షణ వ్యవస్థలో సాంకేతిక, ఇంజినీరింగ్, సంకేత, విద్యుత్ విభాగాలకు సంబంధించిన శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని రైల్వే శాఖ కూడా గుర్తించింది.

అంతేకాదు, సిబ్బందిపై అధిక పనిభారం, తగిన విశ్రాంతి లేకపోవడం, ఖాళీగా ఉన్న కీలక పోస్టులు వంటి అంశాలను కూడా భద్రతా కోణంలో చూడాలి. మానవ తప్పిదాన్ని ప్రమాదానికి సులభమైన కారణంగా చూపడం కంటే, ఆ తప్పిదానికి దారితీసిన వ్యవస్థాగత పరిస్థితులను పరిశీలించడం అవసరం. తగిన సిబ్బంది, సముచిత పనివేళలు, క్రమబద్ధమైన శిక్షణ, అత్యవసర పరిస్థితులపై నిరంతర సాధన భద్రతలో అంతర్భాగాలుగా ఉండాలి.

అదే సమయంలో ప్రతి పెద్ద ప్రమాదంపై స్వతంత్ర, నిష్పాక్షిక, కాలపరిమితితో కూడిన దర్యాప్తు జరగాలి. దర్యాప్తు నివేదికల్లో సూచించిన చర్యలు అమలయ్యాయా లేదా అన్నదానిపై కూడా స్పష్టమైన పర్యవేక్షణ ఉండాలి. బాధ్యత ఎవరిదైనా సరే, నిర్లక్ష్యం నిర్ధారణైతే జవాబుదారీతనం తప్పనిసరి. అదే సమయంలో వ్యవస్థాపరమైన లోపాలను వ్యక్తులపై మాత్రమే మోపకుండా, వాటిని సరిదిద్దే విధానపరమైన చర్యలు కూడా చేపట్టాలి.

రైల్వే భద్రతకు ప్రత్యేకంగా కేటాయించే నిధులు పూర్తిస్థాయిలో, సరైన ప్రాధాన్య క్రమంలో వినియోగించబడటం కూడా కీలకం. కొత్త ప్రాజెక్టులు, అధిక వేగ రైళ్లు, ఆధునిక స్టేషన్లు ఎంత అవసరమో, ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాల నిర్వహణ కూడా అంతే అవసరం. కొత్త నిర్మాణాల కంటే పాత వ్యవస్థల నిర్వహణకు తక్కువ ప్రాధాన్యం ఇచ్చే విధానం దీర్ఘకాలంలో ప్రమాదకరంగా మారవచ్చు.

ప్రయాణికుల పాత్రను కూడా విస్మరించలేం. రైలు తలుపుల వద్ద ప్రమాదకరంగా నిలబడటం, పట్టాలపై అనధికారికంగా దాటడం, అత్యవసర పరికరాలను దుర్వినియోగం చేయడం వంటి చర్యలను నివారించేలా నిరంతర ప్రజా అవగాహన అవసరం. భద్రత అనేది కేవలం రైల్వే శాఖ బాధ్యత కాదు; రైల్వే యాజమాన్యం, సిబ్బంది, ప్రయాణికులు, సాంకేతిక సంస్థలు, నియంత్రణ వ్యవస్థలు---అందరి సమిష్టి బాధ్యత.

అందువల్ల భారత రైల్వేల తదుపరి దశ 'వేగవంతమైన రైల్వే' నుంచి 'సురక్షితమైన, విశ్వసనీయమైన, జవాబుదారీతనం కలిగిన రైల్వే' వైపు సాగాలి. కవచ్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వేగంగా విస్తరించడంతో పాటు పట్టాల నిర్వహణ, సంకేత వ్యవస్థలు, సిబ్బంది శిక్షణ, పనిభారం నియంత్రణ, ప్రమాదాల దర్యాప్తు, నిధుల వినియోగం, బాధ్యత నిర్ధారణ వంటి అంశాలను ఒక సమగ్ర భద్రతా విధానంలో భాగం చేయాలి.

రైల్వే ఆధునికీకరణకు వేగం ముఖ్యం; కానీ రైల్వే భద్రతకు అప్రమత్తత, నిర్వహణ, శిక్షణ, సాంకేతికత, పారదర్శకత, జవాబుదారీతనం---అన్నీ సమానంగా అవసరం. రైలు ఎంత వేగంగా ప్రయాణిస్తుందన్నది అభివృద్ధికి సూచిక కావచ్చు; కానీ ప్రతి ప్రయాణికుడిని సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చగలగడమే భారత రైల్వేల అసలైన విజయానికి కొలమానం.

# మంథర-వక్రీకృత ఆలోచనల ప్రభావం

## ఒక మాటతో మారిన అయోధ్య భవిష్యత్తు

**రామాయణంలో మంథర పాత్ర కనిపించేది కొద్దిసేపే అయినా, ఆమె మాటల ప్రభావం కథాగమనాన్నే మార్చివేస్తుంది. శ్రీరాముని పట్టాభిషేక వార్తతో అయోధ్య నగరమంతా ఆనందంలో మునిగిపోతున్నప్పుడు, మంథర మాత్రం ఆ శుభవార్తలో ప్రమాదాన్ని వెతుకుతుంది. శ్రీరాముడు రాజైతే కౌసల్యకు ప్రాధాన్యం పెరుగుతుందని, కైకేయి సేవకురాలిగా మారిపోతుందని, భరతుని భవిష్యత్తు నాశనమవుతుందని ఆమె భయపెడుతుంది. అప్పటివరకు రామునిపై అపారమైన ప్రేమ కలిగిన కైకేయి, మంథర మాటల ప్రభావంతో తన మనస్తత్వాన్నే మార్చుకుంటుంది.**




### అనుమానం అనే విషబీజం

మంథర ఉపయోగించిన ప్రధాన ఆయుధం అసత్యం మాత్రమే కాదు; అనుమానం. ప్రస్తుతం లేని ప్రమాదాన్ని భవిష్యత్తులో తప్పకుండా సంభవించబోయే విపత్తుగా చూపించింది. కైకేయి మనసులోని మాతృప్రేమను భయం, అసూయ, అధికార కాంక్షలుగా మార్చింది. ఫలితంగా కైకేయి దశరథుడు గతంలో ఇచ్చిన రెండు వరాలను ఉపయోగించి భరతుడికి పట్టాభిషేకం, శ్రీరాముడికి పద్నాలుగు సంవత్సరాల అరణ్యవాసం కోరింది.

వక్రీకృత ఆలోచన ఒక వ్యక్తినే కాదు, కుటుంబాన్ని, రాజ్యాన్ని కూడా సంక్షోభంలోకి నెట్టగలదని ఈ సంఘటన తెలియజేస్తుంది. మంథర స్వయంగా రాజ్యాధికారం చేపట్టలేదు. అయినప్పటికీ ఆమె సృష్టించిన అపోహలు దశరథుని మరణానికి, రాముని అరణ్యవాసానికి, అయోధ్య ప్రజల దుఃఖానికి కారణమయ్యాయి.

### నేటి సమాజంలో మంథర మనస్తత్వం

ఆధునిక సమాజంలో మంథర ఒక వ్యక్తికి మాత్రమే ప్రతీక కాదు. ఇతరుల మనసుల్లో అసూయ, అభద్రత, అనుమానం, ద్వేషం నాటే ప్రతి దుష్ప్రభావం మంథర మనస్తత్వాన్నే ప్రతిబింబిస్తుంది. కుటుంబాల్లో అన్నదమ్ముల మధ్య ఆస్తి వివాదాలు రెచ్చగొట్టేవారు, భార్యాభర్తల మధ్య అపార్థాలు సృష్టించేవారు, కార్యాలయాల్లో సహోద్యోగులపై తప్పుడు సమాచారాన్ని అందించేవారు ఈ కోవకు చెందుతారు.

రాజకీయ రంగంలో ప్రజల వాస్తవ సమస్యలపై చర్చ జరగకుండా కులం, మతం, ప్రాంతం, భాష పేరుతో భయాలను సృష్టించడం కూడా వక్రీకృత ఆలోచనల ప్రభావమే. ఒక వర్గం అభివృద్ధి మరొక వర్గానికి నష్టమని ప్రచారం చేయడం ద్వారా సామాజిక ఐక్యతను దెబ్బతీస్తున్నారు. ఇటువంటి ప్రచారాలు తాత్కాలిక రాజకీయ లాభాన్ని ఇవ్వవచ్చు; కానీ సమాజంలో దీర్ఘకాలిక విభేదాలను సృష్టిస్తాయి.

### సామాజిక మాధ్యమాల్లో అపోహల ప్రవాహం

నేటి కాలంలో మంథర మాటలకు సామాజిక మాధ్యమాలు అపారమైన వేగాన్ని అందిస్తున్నాయి. నిర్ధారణ లేని వార్తలు, కత్తిరించిన వీడియోలు, మార్పుచేసిన చిత్రాలు, విద్వేషపూరిత వ్యాఖ్యలు క్షణాల్లో లక్షల మందికి చేరుతున్నాయి. ఒక అసత్యాన్ని పదేపదే ప్రచారం చేస్తే అది నిజమనే భ్రమ ఏర్పడుతుంది. ప్రజలు ఆవేశంతో స్పందించి, తరువాత నిజానిజాలు తెలుసుకునే పరిస్థితి ఏర్పడుతోంది.

కైకేయి చేసిన ప్రధాన తప్పు మంథర మాటలు వినడం కాదు; వాటిని పరిశీలించకుండా నమ్మడం. ఆమె దశరథునితో, శ్రీరామునితో లేదా భరతునితో ప్రశాంతంగా మాట్లాడి ఉంటే అపోహలు తొలగిపోయేవి. నేటి కుటుంబాలు, సంస్థలు, సమాజం కూడా ఇదే పాఠాన్ని నేర్చుకోవాలి. ఇతరులు చెప్పిన మాటల ఆధారంగా నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత వ్యక్తులతో నేరుగా మాట్లాడాలి.

### వివేకమే రక్షణ కవచం

మన చుట్టూ ఎవరు ఉన్నారన్నదానికంటే, వారి మాటలు మన ఆలోచనలను ఎటువైపు నడిపిస్తున్నాయన్నదే ముఖ్యమైనది. మంచి సలహా మనలో వివేకం, ధైర్యం, న్యాయబుద్ధిని పెంచుతుంది. దుష్సలహా మాత్రం భయం, అసూయ, అనుమానాలను పెంచుతుంది.

మంథర కథ అందించే ఆధునిక సందేశం స్పష్టం---వినిపించిన ప్రతి మాట నిజం కాదు; మనకు అనుకూలంగా వినిపించిన ప్రతి సలహా మేలైనది కాదు. సమాచారం వెనుక ఉద్దేశాన్ని పరిశీలించాలి. భావోద్వేగంతో కాకుండా వివేకంతో నిర్ణయాలు తీసుకోవాలి. లేకపోతే ఒక వక్రీకృత ఆలోచన వ్యక్తిగత ప్రశాంతతనే కాదు, కుటుంబ సామరస్యాన్ని, సంస్థల విశ్వసనీయతను, దేశ ఐక్యతను కూడా నాశనం చేయగలదు.



**ప్రొఫెసర్ విశ్వేశ్వర రావు చెనమల్లు**

# గణపతికి ఎందుకు ఎందుకు తొలి పూజ?

**తండ్రి ఇచ్చిన వరం తొలి పూజ**

**ఒకసారి దేవతలందరికీ "మొదట ఎవరిని పూజించాలి?" అనే పోటీ వచ్చింది. అందరూ తమ వాహనాల మీద ముల్లోకాలు చుట్టి రావాలని శివుడు చెప్పాడు. కుమారస్వామి నెమలి మీద వేగంగా బయలుదేరాడు. వినాయకుడు మాత్రం తన తల్లిదండ్రులైన పార్వతీ పరమేశ్వరుల చుట్టూ ప్రదక్షిణ చేసి "తల్లిదండ్రులే నాకు ముల్లోకాలు" అన్నాడు. ఆ బుద్ధికి మెచ్చి శివుడు "ఈ రోజు నుండి ఏ శుభకార్యం అయినా, ఏ పూజ అయినా ముందు నీకే పూజ జరగాలి, లేకపోతే ఆ పూజకు ఫలితం ఉ ండదు" అని వరం ఇచ్చాడు. అందుకే ఏ పని మొదలుపెట్టినా ముందు గణపతి పూజ చేస్తాం.**




**పెద్ద తల:**
గణపతి యొక్క తల సువిశాలం గా చాలా చాలా పెద్దదిగా మనకు దర్శనమిస్తుంది. మన మెదడులో ఉండే ఆలోచనలు జ్ఞానం బట్టి మన నడవడిక మన నడత ఆధారపడి ఉంటుంది. ఎక్కువ జ్ఞానం కోసం ఆలోచించమని, ఆలోచించిన విషయాన్ని ఆచరణలో పెట్టాలి అని అవన్నీ మన తలలో నిక్షిప్తంగా ఉండాలి అని తెలుపుటకు ఉదాహరణగా ఈ పెద్ద తలతో మనకు దర్శనం ఇస్తాడు మన గణపయ్య.

అంతర్వాణి

**చిన్న కళ్ళు:**
ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలించి ఏదైనా నిర్ణయం తీసుకోవాలి. అతి జాగ్రత్తతో ప్రవర్తించాలి కానీ అధిక వేగంతో ప్రవర్తించకూడదు అని నయనాలు చెబుతున్నాయి.

**పెద్ద చెవులు:**
మానవ జీవితంలో మానవులు అనేక రకాలైన విషయాలను అతి తొందరపాటుతో క్షణకాలం మాత్రమే వింటారు. కానీ గణపతి యొక్క చెవులు ఎక్కువ వినమని మనకి ప్రబోధిస్తున్నాయి. ఎక్కువ జ్ఞానం లభించాలి అంటే ఎక్కువ వినాలి.

**చిన్న నోరు**
మన జీవితంలో ఎంత తక్కువ మాట్లాడితే అంత ఉత్తమమైనటువంటి లక్షణంగా భావించాలని గణపయ్య నోరు మనకు చెబుతున్నది.

**పెద్ద పొట్ట (లంబోదరం):**
జీవితకాలంలో ఎవరికైనా సర్వసాధారణమైనవి మంచి చెడు మంచి. అన్నీ రోజులు ఒకేలా ఉండవు. మంచి రోజులను, చెడు రోజులను ఒకే స్థాయి లో ఒకే విధంగా జీర్ణించుకోవడం కోసమే పెద్ద ఉదరము తో లంబోదరుడు మమనకు దర్శనమిస్తాడు.

మూషిక వాహనం: భారీ కాయం ఉన్న విజ్ఞాతిపతికి విఘ్నేశ్వరుడి యొక్క అతి చిన్న. దైన శరీరం తో మూషిక వాహనము మనకు ఇచ్చే సందేశం...మనము నడిచే దిశ, గమ్యం బాగుగా చేరే విధంగా వాహనం ఉ ండాలి కానీ ఆకృతితో సంబంధం లేదు అని చెబుతున్నది. కోరిక అనే ఎలుకను అదుపులో ఉంచుకోవాలని కూడా మనకు మంచి సలహాను ఇస్తున్నది.

**విఘ్నాలను తొలగించేవాడు విజ్ఞాధిపతి అయిన విగ్నేశ్వరుడు**
కొన్ని విషయాలలో మనలో మనకే అనేక రకాలైన భయాలు పుడుతూ ఉ ంటాయి

మన మనసులో భయం, అనుమానం, బద్ధకం అనేవే అసలైన విఘ్నాలు. వినాయకుడిని పూజిస్తే ఆ మానసిక అడ్డంకులు తొలగి, ఏ పనైనా నిర్విఘ్నంగా పూర్తవుతుందని నమ్మకం.

**బుద్ధికి, చదువుకు అధిపతి**
ఆయన తల ఏనుగు తల. ఏనుగుకు జ్ఞాపకశక్తి చాలా ఎక్కువ. అందుకే పిల్లలు పరీక్షలకు వెళ్ళే ముందు, ఏదైనా కొత్త విద్య నేర్చుకునే ముందు వినాయకుడిని పూజిస్తే బుద్ధి, జ్ఞానం వృద్ధి చెందుతాయి.

గణాలకు అధిపతి మన శరీరం లో ఉ న్న పంచేంద్రియాలకు అధిపతి గణపతి

"గణపతి" అంటే గణాలకు పతి. మన శరీరంలోని పంచేంద్రియాలు, మన చుట్టూ ఉన్న సమాజం - అన్నీ గణాలే. వాటన్నింటినీ నాయకుడు గణపతి. ఆయనను పూజిస్తే మన ఇంద్రియాలపై మనకు అదుపు వస్తుంది.

ఏ పని అయినా మంచి ఆలోచన (పెద్ద తల), ఎక్కువ వినడం (పెద్ద చెవులు), తక్కువ మాట్లాడటం (చిన్న నోరు) తో మొదలుపెడితే విజయం తప్పకుండా వస్తుంది. ఆ లక్షణాలన్నీ నేర్పే గురువే గణపతి. అందుకే విఘ్నేశ్వరున్ని మొదట పూజించాలి.

**రచన**
**ఏ బాల సౌజన్యకుమారి**
**తెలుగు ఆచార్యులు**
**నంది అవార్డు గ్రహీత**
**కళాతపస్వి, విద్యావేత్త**
**ఆధ్యాత్మికవేత్త ప్రవచనకర్త**



## అలరించిన శ్రీదేవి గాత్ర సంగీత కచేరి

**విశాఖపట్నం, సెప్టెంబర్ 12, జయ జయహే**

త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాల్లో భాగంగా శనివారం ప్రముఖ గాత్ర విద్వాంసురాలు, తిరుపతికి చెందిన ఎం సి హెచ్ శ్రీదేవి గాత్ర సంగీత కచేరి అందరినీ ఆకట్టుకుంది. ఆరాధన ట్రస్ట్ అధ్యక్షులు ఎం ఎస్ ఎన్ రాజు, విఎండిఏ కోశాధికారి పైడా కృష్ణ ప్రసాద్ , వెంకటరావు, కుమారి వరేన్య , డాక్టర్ కేజీ వేణు, మేనేజర్ మోహన్ దాస్ జ్యోతి ప్రకాశనం చేసి శుభారంభం చేశారు. పద్మశ్రీ బాలకృష్ణ ప్రసాద్ దగ్గర 600కు పైగా అన్నమాచార్య కీర్తనలు అలాగే పురందరదాసు రామదాసు కీర్తనలు కూడా నేర్చుకున్న గొప్ప కళాకారిణి శ్రీ దేవి. ఈమె ఆల్ ఇండియా రేడియో ఏ గ్రేడ్ కళాకారిణిగా, శాస్త్రీయ సంగీతం గానం చేస్తూ ముందుగా గణపతి స్తోత్రం ఆ తర్వాత ఎందరో మహానుభావులు శ్రీ రాగం. తాళం లో తదనంతరం రాగాలాపన చేసి స్వరకల్పనతో చక్కటి అంశాలను శ్రావ్యంగా గానం చేసి శ్రోతల కరతాల ధ్వనులను అందుకున్నారు.వీరికి సహకారంగా వర్ధమాన కళాకారిణి కుమారి గాయత్రి వరేన్య వైలన్ పైన, మృదంగంపై ప్రముఖ మృదంగ విద్వాంసులు సీనియర్ కళాకారులు జి. వెంకటరావు సహకరించి ద్విగుణీకృతం చేశారు. అధ్యక్షులు రాజు మాట్లాడుతూ ఈనెల 20న ప్రముఖ గజల్ విద్వాంసుడు డా. గజల్ శ్రీనివాస్ కుమార్తె కుమారి సంస్కృతి తెలుగు గజల్ కార్యక్రమం ఉంటుందని ప్రేక్షకుల అధికంగా వచ్చి విని ఆశీర్వదించి ఆనందించి చివరిగా ప్రసాదాలు తీసుకోవలసిందిగా కోరారు.



### ఘనంగా ముగిసిన

## తితిదే కార్యక్రమాలు

**రుద్రవరం (జయ జయహే)**

తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో రుద్రవరం మండలం, డి. కొట్టాల గ్రామంలోని శ్రీ రామాలయం నందు గత ఐదురోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమంలో అత్యంత భక్తి శ్రద్ధలతో ముగిశాయి. ప్రతిరోజు స్థానిక భజన మండలి చే భజనలు, ఇస్కాన్ ధర్మ ప్రచారకులు శ్రీశ్రీ నిత్యతృప్తదాస్ స్వామీజీచే శ్రీమద్రామాయణము, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. సమాజంలో భక్తిచింతన పెరిగినప్పుడే సమాజం సుఖ సంతోషాలతో వర్ధిల్లుతుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. అర్చకులు సత్యనారాయణశర్మ భక్తులందరితో గోవును సర్వాంగ సుందరంగా అలంకరించి, సామూహిక కుంకుమార్చనలు మరియు గోపూజ కార్యక్రమాన్ని నిర్వహింప చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి బ్రహ్మానందరెడ్డి, నరసింహారెడ్డి, చిన్న సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, రాముడు, కృష్ణ, నాగరాజు, మల్లికార్జున్, దస్తగిరిరెడ్డితోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## భక్తితో పూజిద్దాం.. భద్రతతో ఉత్సవాలు నిర్వహిద్దాం!

### గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్.. ముందస్తు నమోదు తప్పనిసరి

**రాజమహేంద్రవరం: జయ జయహే: సెప్టెంబర్ 12**



వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పాటు పూర్తి విద్యుత్ భద్రతతో నిర్వహించాలని తూర్పు గోదావరి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. తిలక్ కుమార్ కోరారు. 2026 సంవత్సరానికి అధీకృత గణేష్ మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ సరఫరా కల్పిస్తున్నట్లు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో 3 కిలోవాట్లు, పట్టణ ప్రాంతాల్లో 5 కిలోవాట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సౌకర్యాన్ని పొందే మండపాల నిర్వాహకులు ముందుగా విద్యుత్ శాఖలో నమోదు చేసుకోవాలని సూచించారు.మండపాల్లో వైరింగ్, విద్యుత్ పరికరాలు, ఎర్తింగ్, కనెక్షన్లు, లైటింగ్‌ను భద్రతా ప్రమాణాలకుఅనుగుణంగా ఏర్పాటు చేయాలన్నారు. దెబ్బతిన్న తీగలు, నాసిరకం పరికరాలు, అధిక లోడ్‌కు సరిపోని వైరింగ్‌ను పూర్తిగా నివారించాలని సూచించారు.విద్యుత్ సరఫరా విడుదలకు ముందు భద్రతా చర్యలను క్షేత్రస్థాయి అధికారులు పరిశీలించి అవసరమైన సూచనలు అందిస్తారని తెలిపారు. అనధికారిక విద్యుత్ కనెక్షన్లు తీసుకోవద్దని, ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా విద్యుత్ తీగలను ఏర్పాటు చేయాలని నిర్వాహకులను కోరారు.విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్, అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని తిలక్ కుమార్ స్పష్టం చేశారు.ముందుగా నమోదు చేసుకోండి.. అధికారుల సూచనలు పాటించండి.. సురక్షిత విద్యుత్ వినియోగంతో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించండి” అని ఆయన కోరారు.



## అనకాపల్లి లక్ష్మీదేవి పేట బ్రిడ్జికి మోక్షం

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి పట్టణ ప్రజలు 17 ఏళ్లుగా ఎదురుచూస్తున్న లక్ష్మీదేవి పేట రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం దిశగా కీలక ముందడుగు పడింది రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ తెలిపారు అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో 50 పడకల క్రిటికల్ కేర్ సెంటర్ ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియా తో మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో రైల్వే జాతీయ రహదారులు వైద్య మౌలిక వసతులు అభివృద్ధికి సంబంధించి చేపడుతున్న పలు కీలక కార్యక్రమాలను ఆయన శనివారం మీడియా సమావేశంలో వివరించారు లక్ష్మీ దేవి పేట రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం సుమారు 90 కోట్ల రైల్వే నిధులు కేటాయించినట్లు సీఎం రమేష్ పేర్కొన్నారు ఇందులో భూసేకరణ సివిల్ వర్క్స్ తదితర పనులకు నిధులు వినియోగించనున్నట్లు ఇందులో భాగంగా రైల్వే పరిధిలో చేపట్టాల్సిన పనులు అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి 52.77 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ జారీ చేసినట్టు ఆయన తెలిపారు టెండర్ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి రానున్న 30 రోజుల్లో కాంట్రాక్టర్ల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి దిశగా చర్యలు చేపడుతున్నామని రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్గా ఈ ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని రైల్వే ఉన్నత అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తున్నామని లక్ష్మీదేవి పేట రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే అక్కడున్న రైల్వే గేట్ వద్ద తరచూ ఏర్పడే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతోపాటు అనకాపల్లి పట్టణంలో వాహనాల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని సీఎం రమేష్ పేర్కొన్నారు అలాగే అనకాపల్లి నుంచి రాజమహేంద్రవరం వరకు వైపై వెళ్లే జాతీయ రహదారిని ప్రస్తుతం ఉన్న నాలుగు రోడ్ల లైన్ల నుంచి ఆరు లైన్లుగా విస్తరించే ప్రాజెక్టుకు డి పి ఆర్ సిద్ధమైనట్టు ఎంపీ సీఎం రమేష్ తెలిపారు ప్రాంతంలో పెరుగుతున్న వాహన రద్దీ పారిశ్రామిక అభివృద్ధి భవిష్యత్తులో రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుని రహదారి సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు ఈ ప్రాజెక్టుకు సంబంధించి అలైన్ మెంట్ ఇతర సాంకేతిక అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షిస్తూ అవసరమైన సూచనలు చేస్తున్నామని ఆయన తెలిపారు అనకాపల్లి జిల్లాలో రైల్వే జాతీయ రహదారులు వైద్య మౌలిక వసతులను సమాంతరంగా అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలు మెరుగైన రవాణా వైద్య సదుపాయాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆయన పేర్కొన్నారు



### లోక్ అదాలత్‌లో

## 750 కేసులు పరిష్కారం

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి జిల్లా న్యాయ సేవాదకర సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్అదాలత్ నిర్వహించారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి వి నరేష్ ఆధ్వర్యంలో ఆరు బెంచులను ఏర్పాటు చేసి కేసులను పరిష్కరించడం జరిగింది మొత్తం 750 కేసులు పరిష్కారం కాగా ఐదు కోట్ల 57 లక్షల 5561 రూపాయల మొత్తాన్ని కక్షిదారులకు చెల్లించాలని తీర్పులు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి పి నాగేశ్వరరావు అడిషనల్ సివిల్ జడ్జి జి రామకృష్ణ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జి ధర్మారావు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏ రమేష్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వాల్తేర్ వీరయ్య అలాగే అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి వెంకట్రావు కార్యదర్శి కే శివ చారి తదితరులు పాల్గొన్నారు




### పర్యావరణహిత వినాయక చవితికి ‘హారిక రీడింగ్ హాల్’

## వినూత్న అడుగు

**శ్రీకాకుళం. (జయ జయహే )**

విద్యార్థుల్లో విద్యతో పాటు సామాజిక బాధ్యత, పర్యావరణ స్పృహను పెంపొందించాలనే లక్ష్యంతో వినాయక చవితిని పురస్కరించుకుని హారిక రీడింగ్ హాల్ ఆధ్వర్యంలో పర్యావరణహిత మట్టి వినాయక ప్రతిమలు, సీడ్ బాల్స్‌ను విద్యార్థులు, ప్రజలకు పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకురాలు హారిక నీహార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్య అనేది పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా సమాజం, ప్రకృతి పట్ల బాధ్యతను కూడా నేర్పించాలన్నారు. “చదువు, నేర్చు, ఎదుగు” అనే భావనతో విద్యను ప్రోత్సహించడంతో పాటు విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు ప్రత్యామ్నాయంగా సహజ మట్టితో తయారైన వినాయక ప్రతిమలను ప్రోత్సహించడం ద్వారా పర్యావర హిత పండుగలకు ప్రాధాన్యం ఇవ్వాలని, సీడ్ బాల్స్‌ను అనువైన ప్రదేశాల్లో నాటి, సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించవచ్చన్నారు. భక్తితో వినాయకుడిని పూజిద్దాం.. బాధ్యతతో ప్రకృతిని కాపాడుదాం.. విద్యతో ఎదుగుదాం.. పచ్చదనంతో భవిష్యత్తును నిర్మిద్దాం” అని హారిక పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హారిక రీడింగ్ హాల్ నిర్వాహకులు హారిక, నీహార్, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.




### పౌష్టికాహారమే చిన్నారుల

## ఆరోగ్యానికి మహాబలం

**పిఓ మంగతాయారు**

**బుచ్చయ్య పేట జయ జయహే**

వడ్డాది అంగన్వాడి కేంద్రం- 1 లో పోషకాహార మాసోత్సవాల అవగాహన సదస్సులో డాక్టర్ టి రమ్య దుర్గ, ఎ ఎన్ఎం ఆర్ సాయి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మాస ఉత్సవాలు 9- 9-26 నుండి 8-10-26 తేదీల వరకు మాస ఉత్సవాలను నిర్వహిస్తామని, ప్రతిరోజు పిల్లలకు అధిక పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని, తక్కువ ఖరీదు గల చిరుదాన్యాల్లో అనేక పవిత్ర విలువలు ఉంటాయని ఎక్కువ రేటు లొ కన్నా వాటిలో అందులో ఎటువంటి పోషకాలు ఉండవని చిరు ధాన్యాలు వాడితే బలం విటమిన్లు మాంసకృత్తులు ప్రోటీన్లు తో పాటు ఆరోగ్యం కూడా ఉంటుందని రక్తహీనత మహిళల ప్రధాన సమస్యని గర్భిణీలు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్ రమ్య దుర్గ తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఓ మంగతాయారు, అంగన్వాడి కార్యకర్తలు ఎలిసెట్టి అమ్మాజీ ,భవాని, ఎన్జీవో ఎలిసెట్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

## మధు యాష్కిని ఘనంగా సన్మానించిన జువ్వడి

**హైదరాబాద్ (జయ జయహే)**



అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ గా నియామకమైన మాజీ లోక్ సభ సభ్యుడు మధుయాస్కి ని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు ఘనంగా సన్మానించారు హైదరాబాదులోని యాష్కి నివాసంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్రొఫెషనల్ చైర్మన్ గా నియామకమైన సందర్భంగా మొదటిసారి హైదరాబాద్ వచ్చిన మధు యాస్కిని శాలువాతో ఘనంగా సన్మానించి పుష్ప గుచ్చం అందజేశారు



### బంగారు మెట్టలో

## సీతారాం ఏచూరి వర్ధంతి వేడుకలు

**బుచ్చియ్యపేట జయ జయహే**

స్వర్గీయ సీతారాం ఏచూరి దేశ ప్రజలకు చేసిన సేవలు మరువలేను అని బుచ్చయ్య పేట మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు పినపత్రుని సాంబశివరావు అన్నారు. బంగారు మెట్ట లో సీతారం ఏచూరి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాం వ్యవసాయ కార్మికులకు అనేక సంఘాలు చట్టాలు తీసుకువచ్చారని ఆయన గుర్తు చేశారు. సీతారాం ఏచూరి లేని లోటు దేశ ప్రజలకు తీరని లోటుని ఆయన అన్నారు సీతారాం ఏచూరి లాంటి మహోన్నత వ్యక్తిని మనం కోల్పోవడం చాలా బాధాకరమని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తాతయ్య బాబు, శ్రీను, లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కడప దర్గాలో సినీ నటుడు అలీ ప్రార్థనలు

**కడప. జయ జయహే**



కడప నగరంలోని అమీన్ పీర్ పెద్ద దర్గాలో ప్రముఖ సినీ హాస్య నటుడు అలీ సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా ప్రతి నిధులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం సతీమణి జుబేదాతో కలిసి దర్గాలో ప్రార్థనలు చేశారు. ప్రపంచ శాంతి కోసం, అలాగే తన సతీమణి నిర్వహిస్తున్న వ్యాపార ప్రమోషన్లో భాగంగా ఈ నెల 12, 13 తేదీల్లో కడపలో ఉండేందుకు వచ్చినట్లు అలీ తెలిపారు. కడపకు వచ్చిన ప్రతిసారీ దర్గాకు రావడం ఆనవాయితీగా వస్తోందని దర్గాకు రావడం సంతోషంగా ఉందని, ఇక్కడికి వచ్చినప్పుడు మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ స్టేట్ మైనార్టీ సెక్రటరీ, 39వ డివిజన్ మాజీ కార్పోరేటర్ మున్నా, దర్గా ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రీన్ గణేష్‌తో పర్యావరణ పరిరక్షణకు పిలుపు

## 3,500 మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ



**అనకాపల్లి, సెప్టెంబర్ 12, (జయ జయహే )**

పర్యావరణ పరిరక్షణతో పాటు ఆధ్యాత్మిక సంప్రదాయాలను కాపాడే లక్ష్యంతో గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ హైస్కూల్, రాజా థియేటర్ ఎదురుగా, అనకాపల్లిలో గ్రీన్ గణేష్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు 3,500 మట్టి వినాయక విగ్రహాలతో పాటు వ్రతకథ పుస్తకాలు, పసుపు, కుంకుమ, పటిక, తులసి మొక్కలు తదితర పూజా సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ హాజరై ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలు మరియు పూజా సామగ్రిని పంపిణీ చేశారు. శ్రీ గౌరీ సేవా సంఘం అధ్యక్షులు కర్రి సన్యాసి నాయుడు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, వినాయక చవితి భక్తిశ్రద్ధలకు ప్రతీకగా నిలిచే గొప్ప పండుగ అని, అదే సమయంలో మన పండుగలు ప్రకృతికి హాని కలిగించకుండా జరుపుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.

“వినాయకుడిని పూజించడం ఎంత ముఖ్యమో, వినాయకుడి ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమైనది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉంది. అందువల్ల మట్టితో తయారు చేసిన సహజసిద్ధమైన వినాయక విగ్రహాలను ఉపయోగించడం ద్వారా మన భక్తిని, పర్యావరణ బాధ్యతను ఒకేసారి చాటవచ్చు” అని అన్నారు.

“మట్టి వినాయకుడు మన సంప్రదాయానికి ప్రతీక మాత్రమే కాదు... పర్యావరణ పరిరక్షణకు ఒక గొప్ప సందేశం. మన పండుగలు ప్రకృతికి పండుగలుగా మారాలి. అని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజలను భాగస్వామ్యం చేస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్న గ్రీన్ క్లబ్ సేవలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

**గ్రీన్ క్లబ్ సేవలకు ప్రశంసలు**

గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ, భక్తి మరియు పర్యావరణ పరిరక్షణను కలిపే ఉద్దేశంతో గ్రీన్ గణేష్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రజల్లో పర్యావరణ స్పృహ పెంపొందించడమే తమ లక్ష్యమని అన్నారు.



## ఉద్యమాల ఊపిరి పేదల గొంతుక సీతారాం ఏచూరి

### ప్రజా పోరాటాలకు జీవితం అంకితం చేశారు

### టెక్కలిలో ఏచూరి రెండవ వర్ధంతి సభ

**టెక్కలి సెప్టెంబర్ 12 జయ జయహే**

భారతదేశ సమగ్రత అభివృద్ధి కి ప్రజా ఉద్యమాల ఊపిరిగా తన జీవితాన్ని అంకితం చేసిన కామ్రేడ్ సీతారాం ఏచూరి చిరస్మరణీయుడని కామ్రేడ్ కొల్లి ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన ఏచూరి వర్ధంతి సభలో తెలిపారు. సీతారాశీ ఏచూరి తన విద్యార్థి దశ నుంచి ప్రజా ఉద్యమాల్లో పాల్గొని పేద ప్రజల హక్కుల గొంతుకుగా జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేశారని ఏచూరి మరణించిన తర్వాత తన పార్థివ దేహాన్ని సేవల నిమిత్తం వైద్యశాలకు అప్పగించారని ఎంతో అంకితభావం ఉన్న ఆయన స్ఫూర్తి మరువలేమని ఆయన అడుగుజాడల్లో ఉద్యమ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ నడవాలని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు హనుమంతు ఈశ్వరరావు, కుప్పిలి కామేశ్వరరావు, బ గాది వాసుదేవరావు, దుర్గాప్రసాద్, వైకుంఠ రావు, లక్ష్మణ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం

**విజయనగరం,సెప్టెంబర్ 12:(జయ జయహే )**



పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని ప్రముఖ సామాజిక కార్యకర్త, జనసేన పార్టీ సీనియర్ నాయకులు త్యాడ రామకృష్ణారావు(బాలు) పిలుపునిచ్చారు. శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమవుతున్నాయని తెలిపారు. పర్యావరణానికి హాని కలగకుండా మట్టి వినాయక ప్రతిమలను ఉపయోగించి, భక్తిశ్రద్ధలతో వినాయక చవితిని జరుపుకోవాలని ప్రజలను కోరారు. “మట్టి వినాయకుడు -- మన భక్తికి ప్రతీక, పర్యావరణ పరిరక్షణకు బాధ్యత” అని పేర్కొన్నారు.



## చెకుముకి మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ విజయవంతం

**అరకులోయ: సెప్టెంబర్ 12. జయ జయహే.**

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, తార్కిక ఆలోచనా విధానం, పరిశీలనా శక్తి విజ్ఞానశాస్త్రంపై ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో జన విజ్ఞాన వేదిక జెవివి ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ అరకు వ్యాలీలో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అరకు వ్యాలీ ఎంఈఓ--2 త్రినాథ్ మాస్టారు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, ప్రతి విషయాన్ని ప్రశ్నిస్తూ, పరిశీలిస్తూ, ఆధారాలతో నిజానిజాలను తెలుసుకునే అలవాటును పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమానికి Govt. High School ప్రధానోపాధ్యాయులు టీ మోహన్ రావు హాజరై విద్యార్థులను అభినందించారు. వివిధ పాఠశాలలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జె వి వి జిల్లా సహాయ కార్యదర్శి సుబన్ బొడ్నాయక్ మాట్లాడుతూ, చెకుముకి పరీక్షలు విద్యార్థుల్లో కేవలం పోటీ తత్వాన్ని పెంచడం మాత్రమే కాకుండా, ఎందుకు ఎలా అనే ప్రశ్నించే స్వభావాన్ని, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడమే ప్రధాన లక్ష్యం అని తెలిపారు. పాఠశాల స్థాయిలో 8, 9, 10 తరగతులలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు మండల స్థాయి పరీక్షలో పాల్గొన్నారు. ముగ్గురు విద్యార్థులకు కలిపి ఒకే సమాధాన పత్రన్ని అందించి, పరస్పరం చర్చించుకుంటూ సమాధానాలు రాసే విధంగా పరీక్ష నిర్వహించడం ద్వారా సమిష్టి ఆలోచన, తార్కిక విశ్లేషణ సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రోత్సహించారు. మండల స్థాయి పరీక్షలో పాల్గొన్న విద్యార్థులందరికీ స్కూలు లెవెల్ విన్నర్స్ లకు సర్టిఫికెట్స్ ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈఓ త్రినాథ్ చేతుల మీదుగా ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## కొయ్యూరులో వినాయక మట్టి ప్రతిమల పంపిణీ..

**కొయ్యూరు:(జయ జయహే న్యూస్ ) సెప్టెంబర్ 13,**

వీధుల్లోనే కాకుండా ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటిలోనూ వినాయక చవితి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించాలనే సంకల్పంతో వేద సంకల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో గణపతి మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి డివిడి ప్రసాద్ తెలిపారు. బిజెపి అల్లూరి జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ఎం. చక్రరావు, మండల ప్రధాన కార్యదర్శి డి. పద్మరాజు తదితరులతో కలిసి కొయ్యూరు సిఐ బి. శ్రీనివాసరావు తో పాటు సిబ్బందికి వినాయక మట్టి ప్రతిమలను అందజేశారు. అలాగే మండల కేంద్రంలో గల పలు పాఠశాలల విద్యార్థులకు, గ్రామస్తులకు వినాయక ప్రతిమలను అందజేసి చవితి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు. పర్యావరణ హితం కోరుతూ ఈ చర్యలు చేపట్టినట్లు ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్, బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. చక్రరావు తెలిపారు. కొయ్యూరు, జి.కె వీధి, గొలుగొండ, నాతవరం మండలాల పరిధిలోని పలు గ్రామాలలోని భక్తులకు వినాయక మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వద్దు, మట్టి విగ్రహాలే ముద్దు.. మట్టి ప్రతిమలను పూజిద్దాం, పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పూజారులు లక్ష్మణ్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

## అభినందనలా-అఖిలపక్షమా

**రాజమహేంద్రవరం: జయ జయహే: సెప్టెంబర్ 12**



పవన్ కళ్యాణ్‌ను అభినందించేందుకే కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారా? అంటూ రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు ప్రశ్నించారు. గోదావరి జలాల కాలుష్యం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమలపై చర్చించకుండా ఒక రాజకీయ నాయకుడిని అభినందించడం బాధాకరమన్నారు. ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలపై గొంతెత్తాల్సింది పోయి భజన రాజకీయాలకు పాల్పడటం సరైన పరిణామం కాదని విమర్శించారు. గోదావరి కాలుష్యం పెరుగుతున్న సమయంలో పేపర్ మిల్లుకు సంబంధించినఅ-నుమతులు, కాలుష్య నియంత్రణ చర్యలపై అఖిలపక్ష సమావేశంలో చర్చించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సమావేశం కేవలం కితాబులు చెప్పుకునే వేదికగా మారిందని, ఇది రాజమహేంద్రవరం రాజకీయ ప్రతిష్టకు మచ్చగా మిగిలే అవకాశం ఉందని కామరాజు పేర్కొన్నారు.

## మద్యం షాపులు పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకోండి

**చోడవరం సెప్టెంబరు 12 జయ జయహే**



చోడవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన పరిధిలోగల 23 మద్యం షాపులను ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రెన్యువల్ చేయడం జరుగుతుందనీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.వి. పాపనాయుడు శనివారం తెలిపారు. ఇందుకు సంబంధించి రెన్యువల్ చేయడానికి షాపు లైసెన్స్ ఫీజులో 38% అనగా =ం.27,20,000/- లక్షలు గీత కులాలకు సంబిందించిన మద్యం షాప్ వారు =ం.13,60,400/- అమౌంట్ను రెన్యువల్ ఆర్ఈటి కింద జమ చేయవలసి ఉంటుందన్నారు. దీనికి అదనంగా .5000 రూపాయలు- ప్రాసెసింగ్ ఫీజ్, లైసెన్సీ ఫీజు .71, 50,000 రూపాయలు నాలుగు ఇన్స్టాల్మెంట్స్ అనగా ఒక ఇన్స్టాల్మెంట్ .17, 87, 500 రూపాయలు ప్రకారం పర్మిట్ రూమ్ లైసెన్స్ ఫీజు .7,50,000 రూపాయల-ను మూడు ఇన్స్టాల్మెంట్స్ అనగా ఒక ఇన్స్టాల్మెంట్ 2,50,000 రూపాయలు జమ చేయవలసి ఉంటుందన్నారు. ఎవరైనా లైసెన్సీదారుడు రెన్యువల్ చేసుకోకపోతే సదరు షాపులను జిల్లా గెజిట్ లో నోటిఫికేషన్ ఇచ్చి తదుపరి అప్లికేషన్స్ ఆహ్వానించి డ్రా ద్వారా షాపును కేటాయించడం జరుగుతుందన్నారు. దీనికి నాన్ రిఫండబుల్ ఫీజు 3,00,000 రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. అలాగే ప్రాసెసింగ్ ఫీజ్ 1000 రూపాయలు. ప్రతి షాప్ కు మినిమమ్ 4 కంటే ఎక్కువ అప్లికేషన్స్ వస్తే మాత్రమే డ్రా తీయబడునన్నారు. ఒకవేళ 4 అప్లికేషన్స్ రాకపోతే అప్లికేషన్ ఫీజ్ మొత్తం అమౌంట్ను రిటర్న్ చేయబడునున్నారు. మద్యం షాపులకు సంబంధించి మరింత సమాచారం కోసం చోడవరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ను సంప్రదించాలని కోరారు.

## శాంతిభద్రతలపై అప్రమత్తంగా ఉండాలి

### ఎస్పీలతో హోం మంత్రి అనిత టెలికాన్ఫరెన్స్

**అమరావతి, సెప్టెంబర్ 12:-(జయ జయహే )**



రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల ఎస్పీలతో హోం మంత్రి అనిత టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఎస్పీలతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా రానున్న గణేష్ ఉత్సవాల నిర్వహణ, శాంతిభద్రతల పరిస్థితులు, ఉత్సవాలకు అనుమతుల జారీ తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు. గణేష్ ఉత్సవాలకు అనుమతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సింగిల్ విండో విధానంపై ఉత్సవ కమిటీలు, ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఎస్పీలను ఆదేశించారు. గణేష్ మండపాల ఏర్పాటు, నిమజ్జన ఊరేగింపుల నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలపై ప్రజలకు ముందుగానే అవగాహన కల్పించాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులకు స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. నిన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో జరిగిన శాంతిభద్రతల సమీక్ష సమావేశంలో చర్చించిన అంశాలను కూడా హోం మంత్రి అనిత ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్‌లో ప్రస్తావించారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎక్కడా నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని ఎస్పీలకు ఆమె స్పష్టం చేశారు.



## పర్యావరణ పరిరక్షణకు శ్రీ ప్రకాష్ విద్యార్థులు కృషి

### మట్టి గణపతిని హోమ్ మంత్రి కు అందచేసిన విద్యార్థులు

**పాయకరావుపేట (జయ జయహే)**

పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా గుర్తించి శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రజలను జాగృతి చేయడం అభినందనీయమని హోమ్ మంత్రి అనిత అభినందించారు. క్యాంప్ కార్యాలయంలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు హోమ్ మంత్రి అనిత ను కలిసి మట్టి గణనాథుని ప్రతిమను అందజేశారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని, పర్యావరణాన్ని పరిరక్షిందాం నినాదంతో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణిని హోమ్ మంత్రి స్వాగతించారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన మట్టి విగ్రహాన్ని అనితకు అందజేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు చేస్తున్న ప్రయత్నాన్ని ఆమె అభినందించారు. గత ఇరవై ఏళ్లుగా తమ విద్యార్థులు తుని, పాయకరావుపేట జంట నగరాల నందు అధికారులకు, ప్రజాప్రతినిధులకు, నాయకులకు, తల్లిదండ్రులకు ఈ విగ్రహాలు ఉచితంగా అందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ కు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు



## మట్టి విగ్రహాలు పూజించడం ఎంతో శ్రేయోదాయకం

**సిఐ అప్పలరాజు**

**చోడవరం సెప్టెంబర్ 12 జయ జయహే**

పర్యావరణ హితం కోరి సమాజ శ్రేయస్సుకు పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలు పూజించడం ఎంతో శ్రేయోదాయకమని చోడవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ పి అప్పలరాజు చెప్పారు. శనివారం చోడవరం మెయిన్ రోడ్ల గల ఎస్ఎస్ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో 500 మట్టి వినాయక గ్రహాలను పంపిణీ చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత 12 ఏళ్లుగా ఈ షాపింగ్ మాల్ వారు పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషిని ప్రశంసించారు. విగ్రహంతో పాటు పత్రిని కూడా అందజేయడం విశేషం అన్నారు. ప్రజలంతా సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రతినిధులు పిఎస్కే గుప్తా, శ్రీను, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి రాంబాబు, పి అశోకు, రామకృష్ణ మాస్టారు తదితరులు పాల్గొన్నారు



## రోలుగుంట ఉపాధ్యాయురాలు నాగజ్యోతికి టీచర్ ఎక్సలెన్సీ అవార్డు

**రోలుగుంట సెప్టెంబర్ 12 జయ జయహే**

కాకినాడ చేయూత సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు పి.వి.ఎం. నాగజ్యోతికి "టీచర్ ఎక్సలెన్సీ అవార్డు--2026" (అక్షర యోధ పురస్కారశీ)అందజేశారు.విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, విద్యార్థుల్లో అభ్యసన ఆసక్తిని పెంపొందించేందుకు వినూత్న బోధనా పద్ధతులను అవలంబిస్తున్నందుకు నాగజ్యోతిని ఈ  చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి చేయూత సేవా సంస్థ అధ్యక్షులు రవికుమార్ తో పాటు పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు  ప్రముఖులు హాజరయ్యారు. వారి చేతుల మీదుగా పి.వి.ఎం. నాగజ్యోతికి అవార్డును (పురస్కారాలను) అందజేశారు.ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి టీచర్ ఎక్సలెన్సీ అవార్డు, అక్షర యోధ పురస్కారమ్ తో సత్కరించడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో మరింత బాధ్యతతో పనిచేస్తానని తెలిపారు. తనను ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

## భోజన కార్మికుల బకాయిలు చెల్లించండి

**చోడవరం సెప్టెంబర్ 12 జయ జయహే**



మధ్యాహ్న భోజన కార్మికులకు ఈ ఏడాది స్కూల్ ప్రారంభం నుండి ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని మధ్యాహ్నం భోజన పథకం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి కోరారు. శనివారం మాట్లాడుతూ జూన్ నుండి మూడు నెలలుగా బిల్లులు వేతనాలు బకాయిలు ఉన్నాయని, లక్షల రూపాయలు పెట్టుబడి మహిళలు ఎలా పెట్టగలరని ఆమె ప్రశ్నించారు. ప్రతి నెల బకాయి బిల్లులు చెల్లించకపోతే పిల్లలకు ఎక్కడ నుండి అప్పులు తెచ్చి పెట్టాలని ప్రశ్నించారు. కిరాణా షాపుల్లో అప్పులు పేరుకుపోయి మానసిక ఆందోళనకు కార్మికులు గురవుతున్నారని, ఈ పథకంలో పని చేస్తున్న మహిళలు పేద మహిళని ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. రకరకాల మెనూలు పేరుతో మధ్యాహ్న భోజన కార్మికులను అప్పుల ఊబిలో ఊరుకుపోయిన ఏ పూట పిల్లలకు భోజనం ఆపలేదని, కానీ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను గుర్తించడంలో వాళ్ల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యిందని ఆమె అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులపై భారం మోపి లక్షల రూపాయలు ప్రభుత్వం దగ్గర ఉంచుకుంటే పెట్టుబడి ఎక్కడి నుండి తెచ్చి పెట్టాలని ఆమె అన్నారు. ప్రతి స్కూల్లో మౌలిక వసతులు కల్పించాలని, వాటర్ సదుపాయం, వంటషెడ్లు నిర్మించాలని, రాజకీయ వేధింపులు అక్రమ తొలగింపులు ఆపాలని, కనీస వేతనాలు అమలు చేయాలని ఆమె అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మూడు నెలల బకాయి బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తా మని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## మట్టి విగ్రహాలు వినాయక వ్రత కల్పాలు పంపిణీ

**మాడుగుల సెప్టెంబర్ 12 జయ జయహే**

అనకాపల్లి జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘ అధ్యక్షులు శ్రీనాథ్ స్వరూప్  ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లాలో 300 వినాయక మట్టి విగ్రహాలు మరియు వినాయక చవితి వ్రతకల్పం 14 పేజీల బుక్కు ఆర్యవైశ్య యువజనసంఘం తరపున 1000 పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్ శ్రీనివాసరావు వాసవి క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలు పూజించండి

**మాడుగుల సెప్టెంబర్ 12 జయ జయహే**

పర్యావరణ పరిరక్షణకు వాతావరణ సమతుల్యానికి ప్రతి ఒక్కరు వినాయక చవితి పురస్కరించుకొని మట్టి వినాయక విగ్రహాలు పూజించాలని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. శనివారం మాడుగుల బస్టాండ్ ఆవరణలో సమరసిత సేవ ఫౌండేషన్, భారత నిర్మాణ సేవా ఫస్ట్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుకూలంగా పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దానిలో భాగంగానే వివిధ రకాల విగ్రహాలు కాకుండా కేవలం మట్టితో కూడా నిర్గణాలు పూజించడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ విషయంలో భారత నిర్మాణ సేవా ట్రస్టు చేస్తున్న కృషినే ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా 1500 మట్టి విగ్రహాలను పంపిణీ చేసినట్టు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కి అప్పలరాజు, సీనియర్ బిజెపి నాయకుడు పుట్ట గంగయ్య, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పి లక్ష్మీనారాయణ, అవి జల అధ్యక్షుడు ఎస్ శ్రీనివాసరావు, మండల బిజెపి ప్రధాన కార్యదర్శి ఎం సతీష్, సమరసిత సేవా ఫౌండేషన్ జిల్లా ప్రచారి కార్యదర్శి సన్యాసి శెట్టి , మాజీ సర్పంచ్ డి సూర్యారావు, భీమరశెట్టి పైధయ్య నాయుడు, వాసవి క్లబ్ ప్రతినిధులు మామిడి శ్రీను,భారత నిర్మాణ సేవా ట్రస్ట్ ప్రతినిధులు జి మహేష్  పలువురు స్థానికులు పాల్గొన్నారు.



## సెలవు రోజుల్లో కూడా పెన్షన్ దరఖాస్తులు స్వీకరిస్తారు

**మాడుగుల సెప్టెంబరు 12 జయ జయహే**

ఈనెల 12 13 తేదీలు రోజులు అయినప్పటికీ పెన్షన్ లబ్ధిదారుల సౌకర్యార్థం ఇన్ని రోజులు కూడా సచివాలయాల్లో పెన్షన్లు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎండి ఒకే అప్పారావు శనివారం తెలిపారు. నూతన శీగా పింఛన్లు దరఖాస్తు చేసుకొనేందుకు సమయము తక్కువగా ఉన్నందున ఈ రెండు రోజులూ మా స్వర్ణగ్రామాల సిబ్బంది ఈ  కార్యక్రమములో పాల్గొంటారనీ, కాబట్టి అర్హులయిన లబ్ధిదారులు మాడుగుల మండలములోని 23 స్వర్ణగ్రామాలలో కూడా సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని కోరుతున్నారు.సెలవు రోజుల్లో కూడా సేవలు అందిస్తున్న సచివాలయ సిబ్బందిని  పలువురు కొనియాడుతున్నారు.




## కాలు నొప్పితో వెళ్లి వెంటిలేటర్‌పై మృతి

**వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటున్న కుటుంబ సభ్యులు**

**తిరుపతి, సెప్టెంబర్ 12, జయ జయహే**

తిరుపతి: కాలు నొప్పి సమస్యతో శ్రీ బాలాజీ హాస్పిటల్‌కు వెళ్లిన గోవిందస్వామి మూడో రోజుకే వెంటిలేటర్‌పై మృతి చెందడంపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మునెమ్మ, గిరి తమ ఆవేదన వ్యక్తం చేశారు.బాధితుల వివరాల మేరకు.. కేవీబీపురం మండలంలో నిర్వహించిన వైద్య శిబిరానికి హాజరైన గోవిందస్వామిని రేణిగుంట బైపాస్ సమీపంలోని శ్రీ బాలాజీ హాస్పిటల్‌కు తీసుకెళ్లినట్లు తెలిపారు. కాలు నొప్పితో ఆర్థోపెడిక్ ఓపీకి వెళ్లిన ఆయన చికిత్స అనంతరం ఆరోగ్యం విషమించి మృతి చెందారని పేర్కొన్నారు. వైద్యుల నిర్లక్ష్యంపై తమకు అనుమానాలు ఉన్నాయని, చికిత్సకు సంబంధించిన వైద్య రికార్డులు, మరణానికి దారితీసిన పరిస్థితులపై విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓను కోరారు. తప్పు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## 'మన రన్ ఐదు కే'లో విశ్వవిద్యాలయ విద్యార్థికి నాలుగో స్థానం

**ప్రశంసించిన వీసీ ప్రొఫెసర్ శ్రీనివాసన్**

**విశాఖపట్నం:(జయ జయహే)**

విశాఖపట్నంలోని ఆర్కే బీచ్‌లో నిర్వహించిన 'మన రన్ ఐదు కే' పరుగుపందెంలో విశ్వవిద్యాలయంలో మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ చదువుతున్న విద్యార్థి బానోతు ముకేష్ కుమార్ నాలుగో స్థానాన్ని సాధించి ప్రతిభ చాటారు.నెట్‌వర్క్ 18 సంస్థకు చెందిన న్యూస్ 18 తెలుగు, టీఈ స్పోర్ట్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం "ఆరోగ్యం కోసం పరుగు, దృఢత్వం కోసం పరుగు, మాదకద్రవ్య రహిత భారతదేశం కోసం పరుగు" అనే సందేశంతో నిర్వహించారు.ఈ సందర్భంగా బానోతు ముకేష్ కుమార్ నాల్గవ స్థానం సంపాదించి విశాఖపట్నం పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, ఐపీఎస్, డీజీపీతో పాటు మిల్క్ మిస్ట్ సంస్థ ప్రతినిధుల డైరెక్టర్ చేతుల మీదుగా పతకంతో పాటు నాలుగు వేల రూపాయల నగదు బహుమతి అందజేశారు.విశ్వవిద్యాలయ ఇన్‌చార్జ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్, రిజిస్ట్రార్ ఇన్‌చార్జ్ ప్రొ. జితేంద్ర మోహన్ మిశ్రా లు ముకేష్ కుమార్‌ను అభినందించి, రాబోయే పోటీల్లో మరింత ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.విశ్వవిద్యాలయం అందిస్తున్న ప్రోత్సాహం, సహకారం తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని ముకేష్ కుమార్ తెలిపారు. విశ్వవిద్యాలయ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ డా. బొంతు కోటయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. ఎన్.వి.ఎస్. సూర్యనారాయణలు పాల్గొని ముకేష్ కుమార్ కి అభినందనలు తెలిపారు.

## కూటమికి కాపు కాస్తాం!

**స్థానిక సంస్థల ఎన్నికల్లో కాపులకు ప్రాధాన్య మివ్వాలి**

**కాపు ఉద్యమ నేత పులి శ్రీరాములు డిమాండ్!!**

**ఏలూరు, జయ జయహే**



రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాపులకు సంఖ్యా పరంగా తగినన్ని సీట్లు కేటాయించాలని రాష్ట్ర కాపుసంక్షేమ సేవాసంఘ వ్యవస్థాపక అద్యక్షులు పులి శ్రీరాములు కోరారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా లోను కాపు ఓటర్లు ఉన్నా.. కోస్తా జిల్లాల్లో గెలుపు ఓటములనిర్ణయాత్మక స్థాయి లో కాపు లు వున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటనలో రాష్ట్రంలో 2024 లోజరిగిన ఎన్నికల్లో కూటమి గెలుపుకు కాపు సామాజిక వర్గమే కీలకపాత్ర పోషించిన విషయాన్ని శ్రీరాములు గుర్తు చేశారు.రాష్ట్రం లో సింగిల్ లార్జెస్ట్ క్యాస్ట్ గా ఉన్న కాపులకు జనసంఖ్య ఆధారంగా అన్ని స్థాయిల్లో నూ టిక్కెట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు .రాష్ట్ర ఎన్నికల్లో కాపులకు ఉన్న సామాజిక పరంగా గల విధాన పరమైన శక్తి ని కూటమి పార్టీలు గుర్తించలాని పులి శ్రీరాములు కోరారు.కూటమి గా వున్న మూడు ప్రాధాన రాజకీయ పక్షాల్లోనూ కాపు నాయకులు వున్న నేపథ్యంలో వారి గౌరవం స్థాయిని గుర్తించి గ్రామం నుంచిమండలం, జిల్లా రాష్ట్ర పరిధి వరకూ సముచిత గౌరవం ఇవ్వాలని అన్ని పార్టీ లవారినీ కోరారు. అరమరి కలు లేని అనుబంధం, నిజాయితీకాపులు సహజ లక్షణాలని కనుక వారి గౌరవానికి జనాభా కు తగిన రీతిలో సీట్ల కేటాయించి విజయ బావుటా ఎగురవేయాలని కూటమి పెద్దలను శ్రీ రాములు కోరారు.

## మట్టి విగ్రహాలను పంచిన ఎస్ఎస్ఎస్ విద్యా విహార్ చిన్నారులు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 12, జయ జయహే :**





మానవతా విలువలతో కూడిన ఉన్నతమైన విద్యను అభ్యసిస్తూ, పర్యావరణ పరిరక్షణ పట్ల తమ బాధ్యతను చాటిచెప్పారు శ్రీ సత్య సాయి విద్యా విహార్ విద్యార్థులు.వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని, శ్రీ సత్య సాయి సేవా సంస్థల స్కూలు కన్వీనర్, యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది ప్రేరణతో, విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో స్వయంగా మట్టితో పర్యావరణహిత గణేశ విగ్రహాలను తయారు చేశారు. తాము ఎంతో ప్రేమతో తయారు చేసిన ఈ మట్టి వినాయక విగ్రహాలను శనివారం ఎం.వి.పి. కాలనీ పరిసర ప్రాంత ప్రజలకు పంపిణీ చేశారు. అయితే కార్యక్రమం సమయంలో భారీ వర్షం కురుస్తున్నప్పటికీ, చిన్నారులు తమ సేవా సంకల్పాన్ని ఏమాత్రం తగ్గించుకోలేదు. గొడుగుల రక్షణలో, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో, వారు ఇంటింటికీ వెళ్లి మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు భక్తి, ప్రేమతో అందించారు. భారీ వర్షంలోనూ చిరునవ్వులు చిందిస్తూ, తాము స్వయంగా తయారు చేసిన గణేశ విగ్రహాలను ప్రజలకు అందించిన చిన్నారుల దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. చిన్నారుల భక్తి, పర్యావరణ స్పృహ, సేవా భావం, పట్టుదల స్థానిక ప్రజల ప్రశంసలను అందుకుంది. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి సేవా సంస్థల స్కూలు కన్వీనర్, గవర్నింగ్ బాడీ సభ్యులు, ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. పర్యావరణ పరిరక్షణ పట్ల వారు చూపిన శ్రద్ధతో పాటు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని ఆచరణలో చూపినందుకు ప్రశంసించారు.

For a pure tomorrow..
జయహో

# జీవీఎంసీ ఎన్నికల్లో కూటమిదే విజయం

### టీడీపీ ఎన్నికల పరిశీలకులు ఎంఏ షరీఫ్

### మూడు పార్టీల మధ్య పూర్తి సమన్వయం

### 120 డివిజన్లలోనూ కూటమి జెండా ఎగరేస్తాం

**విశాఖపట్నం, సెప్టెంబర్ 12, జయ జయహే**



జీవీఎంసీ పరిధిలో 120 వార్డుల్లో గెలుపు గుర్రాలకే ప్రాధాన్యతనిస్తూ యువతకు పెద్దపీట వేయడంతో పాటు బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఎన్నికల సమన్వయ సమావేశంలో టీడీపీ విశాఖ ఎన్నికల పరిశీలకులు ఎం.ఏ. షరీఫ్అన్నారు. శనివారం జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి పార్టీల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు, విశాఖ జిల్లా ఎన్నికల పరిశీలకులు ఎం.ఏ. షరీఫ్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ.. జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై కూలంకషంగా చర్చించామని, కూటమి పార్టీల మధ్య ఎటువంటి ఇబ్బందులు, అపోహలు, మనస్పర్థలు తలెత్తకుండా పూర్తి సమన్వయంతో పనిచేస్తామని స్పష్టం చేశారు. మూడు పార్టీలకు ఎన్నికల గుర్తులు వేరైనా తమ లక్ష్యం మాత్రం ఒక్కటేనని అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీలు కలిసి కూటమిగా పనిచేస్తూ జీవీఎంసీలో ఘన విజయం సాధించేందుకు కృషి చేస్తాయని తెలిపారు. సమన్వయ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. జీవీఎంసీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించేందుకు క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని అంచనా వేసి అభ్యర్థుల ఎంపిక చేపడతామని తెలిపారు. కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తోందని, బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎం.ఏ. షరీఫ్ తెలిపారు. అదే విధంగా రాజకీయాల్లో యువతకు మరింత ప్రాధాన్యత కల్పిస్తామని, యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తామని అన్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవడమే తమ లక్ష్యం అన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ గత వైసీపీ పాలన ఎంత దారుణంగా ఉందో రాష్ట్ర ప్రజలకు, విశాఖ వాసులకు బాగా తెలుసన్నారు. విశాఖ టీడీపీ అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరామ్ మాట్లాడుతూ.. మాజీ శాసన మండలి అధ్యక్షులు ఎం.ఏ. షరీఫ్ విశాఖ జిల్లా ఎన్నికల పరిశీలకులుగా రావడం శుభ పరిణామమన్నారు. మూడు పార్టీల మధ్య ఎలాంటి గందరగోళానికి తావులేదన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పంచకర్ల సందీప్, పరశురామ్ రాజు, సురేంద్ర మోహన్, పసుపులేటి ఉష కిరణ్, విశాఖ టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లోడగల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




### యువత వ్యాపార నైపుణ్యానికి

## జె.కామ్ దోహదం

**విశాఖపట్నం, సెప్టెంబర్ 12, జయ జయహే**

యువత వ్యాపార నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు జె.కాం దోహదపడుతుందని బిజినెస్ నెట్వర్క్ గ్రోత్ డే కోఆర్డినేటర్ గాయత్రి జిషిత పేర్కొన్నారు. జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ( జెసిఐ) వారోత్సవాల్లో భాగంగా శనివారం జే.కాం 10.0 బిజినెస్ గ్రూపును జెసిఐ వైజాగ్ సభ్యులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో వారోత్సవాల కోఆర్డినేటర్ జె.మౌళి, కోచ్ పి. చంటి, టేబుల్ చైర్మన్ గౌతమ్ సాయి, జెసిఐ వైజాగ్ సభ్యులు కే ఎం కే రమేష్, దిలీప్ కుమార్, ప్రకాష్, కుసుమ తదితరులు పాల్గొని బిజినెస్ మెలకువలు తెలిపారు.



## కిడ్జ్ ఆర్బిట్ స్కూల్లో వైద్య శిబిరం

**విశాఖపట్నం, సెప్టెంబర్ 12, జయ జయహే**

బాలయ్య శాస్త్రి లే అవుట్ లో ఉన్న కిడ్జ్ ఆర్బిట్ ప్లే స్కూల్లో శనివారం రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ, వీ హెల్త్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ బృందానికి ఈ శిబిరంలో వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత, కంటి వైద్య పరీక్షలతో పాటు పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎన్. వాసు బాబు పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు బిపి, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ప్రముఖ గైనకాలజిస్ట్, రొటేరియన్ డాక్టర్ వి.బి.టి.సుందరి మహిళలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. నోటి శుభ్రతను పాటిస్తున్న పలువురు విద్యార్థులకు బెస్ట్ స్మైల్ అవార్డు సర్టిఫికెట్లను, బహుమతులను అందజేశారు. సుమారు 80 మంది ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ సెక్రటరీ కే.ఎం.కే. రమేష్, రోటరీ క్లబ్ హ్యాపీ స్కూల్స్ డైరెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య శిబిరంలో ఏర్పాట్లను పరిరక్షించారు. వి డెంటల్ కార్పొరేట్ మేనేజర్ కే. పృథ్వీరాజ్, డాక్టర్ స్వర్ణలత, కే. తులసి, ప్రణయ్ తదితరులు శిబిరంలో సేవలందించారు.




### పర్యాటకులతో స్నేహపూర్వక

## బాధ్యతయుత టూరిజమే లక్ష్యం

**అరకు/పాడేరు సెప్టెంబర్ 12 జయ జయహే.**

అల్లూరి సీతారామరాజు జిల్లా మేగలకొండా వంజంగిలో పర్యాటక కేంద్రాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లా టూరిజం అధికారి పట్టాసి చలపతిరావు సందర్శించడం జరిగింది ఈ సందర్భంగా వంజంగి గల క్షేత్రస్థాయి వాహన డ్రైవర్లు వాహన యజమానులతో హోటల్స్ నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించి బాధ్యతయుత టూరిజం పై అవగాహన కల్పించడం జరిగింది . ఈ సందర్భంగా వంజంగిలో పర్యాటకులు నుండి అధిక వసుల ఆరోపణలపై వార్త పత్రికలలో వచ్చిన వార్తలు ఆధారంగా సమగ్ర విచారణ స్థానికులతో జరపడం జరిగింది ఈ సందర్భంగా పర్యాటక అధికారి మాట్లాడుతూ వాహనదారులకు పర్యాటకులకు అధిక ధర ఇబ్బంది లేకుండా వాహనదారులకు నష్టం లేకుండా స్నేహపూర్వక వాతావరణం లో వ్యాపారాన్ని కొనసాగించాలని తద్వారా అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యాటకం అభివృద్ధి చెందుతుందని ప్లాస్టిక్ రహిత టూరిజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఈ సందర్భంగా తెలియజేశారు వచ్చే నెల నుండి పర్యాటక సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న టూర్ ఆపరేటర్లు వాహన యజమానులు రెస్టారెంట్ నిర్వాహకులు హోటల్ యాజమాన్యం తో అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి అందరికీ అందుబాటులో ఉండే ధరలు నిర్ణయించుటకు వీలయ్యే విధంగా ఆ మీటింగ్ కు ప్రతి ఒక్కరు హాజరు కావలసిందిగా తెలియజేశారు.



## ఆదిలక్ష్మి మృతికి నివాళులు

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 12, జయ జయహే**

శ్రీకాళహస్తి మండల తెలుగు యువత నాయకుడు చందు నానమ్మ ఎ. ఆదిలక్ష్మి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, చెంచయ్య నాయుడు ముచ్చివోలు గ్రామంలోని చందు నివాసానికి చేరుకుని ఆదిలక్ష్మి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చందు కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆదిలక్ష్మి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.



## రాజీ మార్గమే రాజ మార్గం

### లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి: జడ్జి కృష్ణన్ కుట్టి

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 12, జయ జయహే**

శ్రీకాళహస్తి: రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతుందని 12వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో పరిష్కరించే కేసులకు అప్పీల్ ఉండదని, అన్ని రకాల సివిల్ కేసులతో పాటు రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో లేని ప్రీ-లిటిగేషన్ కేసులను సైతం లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎక్సైజ్ మెజిస్ట్రేట్ శిల్పా, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, బీఎస్ఎన్ఎల్, బ్యాంకు అధికారులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.




### స్థానిక ఎన్నికలకు

## జనసేన సన్నద్ధం

### క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై సమీక్ష

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 12, జయ జయహే**

శ్రీకాళహస్తి: స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతలో భాగంగా జనసేన పార్టీ పార్లమెంట్ స్థాయి స్థానిక సంస్థల ఎన్నికల సమీక్షా సమావేశం శ్రీకాళహస్తిలో నిర్వహించారు. పార్లమెంట్ స్థాయి సమావేశం కోఆర్డినేటర్ పత్సమట్ల ధర్మరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎన్నికల కార్యాచరణ, మండలాల వారీగా పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయి సమన్వయంపై చర్చించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకుడు, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ సాయి కొట్టే ప్రసాద్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలోఉమ్మడి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు పి. హరిప్రసాద్, తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ రాయల్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కీర్తన, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆశావాహులు తదితరులు పాల్గొన్నారు.

## అజయ్ కుమార్ రెడ్డికి అభినందనలు

**బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబర్ 12, జయ జయహే**

బుచ్చినాయుడుకండ్రిగ వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విడుదల చేసిన తిరుపతి జిల్లా అనుబంధ విభాగాల కమిటీలో జిల్లా రైతు విభాగం జనరల్ సెక్రటరీగా ఆ. అజయ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా బి.ఎన్.కండ్రిగ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. రైతుల సమస్యలను తెలుసుకుని, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి అజయ్‌కుమార్‌రెడ్డి సేవలందించాలని వారు ఆకాంక్షించారు.





## శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్న యూపీ మంత్రి

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 12, జయ జయహే**

శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానాన్ని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర కారాగార శాఖ మంత్రి సురేష్ రాహి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ బీకే వెంకటేశులు ఆలయ మర్యాదలతో మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించగా, దేవస్థానం తరపున తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com